జనరాజకీయం కోసం...

రూ॥ 10/-

# లోక్‌సత్తా టైమ్స్

సంపుటి-1 సంచికలు - 9,10 పక్షపత్రిక మే1-31, 2010




## సామాన్యుడి దరికి న్యాయం చేరేదెప్పుడు?



న్యూజెర్సిలో ప్రసంగిస్తున్న డా॥ జేపీ



వాషింగ్టన్ డిసిలో ప్రసంగిస్తున్న డా॥ జేపీ



సియాటెల్ లో ప్రసంగిస్తున్న డా॥ జేపీ



## పరివర్తన

రాజకీయ, ఆర్థిక విప్లవాలు కానీ, సామాజిక సంస్కరణలు కానీ పరివర్తనను తేలేవు. నూతన ఆదర్శాలు, మతాత్మకమైన ఆశయాలు అవలంబించినా, కొత్త సిద్ధాంతాలతో, కొత్త పద్ధతులలో మనిషిని నిర్భంధించినా అది జరగదు. తనని తాను పూర్తిగా అవగాహన చేసుకొంటూ, హృదయంతో స్పందినస్తూ, జీవించటంలోనే పరివర్తన సాధ్యమౌతుంది. లేనట్లయితే ఈ యుద్ధాలు హింసాకాండ, విధ్వంసం ఇట్లాగే కొనసాగుతాయి.

– జిడ్డు కృష్ణమూర్తి

## లోపలి పేజీల్లో...


స్థానిక ప్రభుత్వాల సాధికారత................ 5
జిల్లా అంబుడ్స్‌మెన్........................... 6
ఓచర్ పాఠశాలలు............................ 7
పౌరులు – ప్రాథమిక బాధ్యతలు............ 8
సమాచార హక్కు చట్టం అమలు............ 9
హైకోర్టులో పిటీషన్ .......................... 10
ఐఎస్ఐ గుర్తు దుర్వినియోగం................ 11
సర్కారును నిలదీయండి ..................... 12
ఎస్.సి., ఎస్.టీ, ల స్వావలంబన ........... 13
ఐఐటీల సీట్ల తగ్గింపు తుగ్లక్‌చర్య ............ 14
ప్రజల్లో చైతన్యం పెంచాలి .................. 15
ఆన్సర్‌షీట్స్ పొందడం మన హక్కు .......... 16
నిధులు ఎక్కడికి పోతున్నట్లు ................. 17
అవినీతిని నివారించడానికి ప్రణాళిక.......... 17
చట్టవిరుద్ధమైన వ్యాపారం .................... 18
మహిళాసత్తా .................................. 20
మహిళలపై హింస ........................... 21
మున్సిపల్ ఎన్నికలకు సన్నద్ధం .............. 24
జనం చేతికి అధికారం ....................... 25
లోక్‌సత్తా పార్టీ జిల్లాల సమాచారం .......... 27


# గ్రామ న్యాయాలయాలు

**సంపాదకీయం**

పేదలకు తక్కువ ఖర్చుతో, త్వరితగతిన న్యాయం అందించే గ్రామన్యాయాలయాల (స్థానిక కోర్టుల) ఏర్పాటుకు ఎటువంటి ఆలస్యంలేకుండా వెంటనే చర్యలు చేపట్టాలి.

విపరీత ఖర్చు, దూరాభారం, భాష, కోర్టు విధానాలు అవరోధంగా మారటం వల్ల పేదలకు న్యాయం అందటం లేదు, గ్రామన్యాయాలయాలు ఏర్పాటైతే పేదలకు సత్వరం, తక్కువ వ్యయంతో న్యాయం అందుబాటులోకి వస్తుంది. ఈ చట్టం అమలైతే ఆంధ్రప్రదేశ్‌లో ఒక్కసారే 1100 స్థానిక కోర్టులు వస్తాయి.

మొత్తం పెట్టుబడి వ్యయాన్ని భరిస్తానని, కోర్టుల నిర్వహణ ఖర్చులో చాలాభాగం తిరిగి చెల్లిస్తానని జాతీయ ప్రభుత్వం స్పష్టం చేసింది. ఒక కోర్టు ఏర్పాటుకు రూ. 18లక్షలు, ఏటా నిర్వహణకు రూ. 6.4లక్షలు ఖర్చవుతుంది.

"దేశవ్యాప్తంగా కోర్టుల ఏర్పాటుకు రూ. 1400కోట్లు కేటాయిస్తున్నట్టు జాతీయ న్యాయశాఖామంత్రి ప్రకటించిన నేపథ్యంలో ఆర్థికసాయం కోసం రాష్ట్రం జాతీయ ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాలి.

స్థానిక కోర్టుల ఏర్పాటు అనే గొప్ప హామీ వాస్తవరూపం దాల్చి, ఆశించిన ఫలితాలనివ్వాలంటే రాష్ట్రప్రభుత్వం బడ్జెట్ కేటాయింపులు చేయటంతోపాటు సాధ్యమైనంత త్వరితంగా కోర్టులకు మౌలిక వసతులు కల్పించాలి. నిబంధనల రూపకల్పన, న్యాయమూర్తుల నియామకంపై హైకోర్టుతో సంప్రదించాలి. "హైకోర్టుతో సంప్రదించి అన్ని మండలాల్లో గ్రామన్యాయాలయాల్ని, న్యాయాధికారుల్ని ఏర్పాటు చేయాలి. గ్రామాలలో న్యాయవిచారణకు కావలసిన సదుపాయాలు కల్పించాలి. ఈ కోర్టుల సివిల్, క్రిమినల్ విచారణాపరిధిని నిర్వచించటంతోపాటు హైకోర్టుతో సంప్రదించి సివిల్ కేసుల ఆర్థికపరిమితిని నిర్ణయించాలి. గ్రామన్యాయాలయాలు సమర్థవంతంగా పనిచేయటానికి కావలసిన విధాన, సంప్రదింపులపరమైన ఇతర అన్ని చర్యల్నీ చేపట్టాలి". ■

**ఒక వ్యక్తి ఎలాంటివాడో తెలుసుకోవాలంటే అతడిని 'అధికారం' లో కూర్చోబెట్టి చూడు** – యుగోస్లావియా సామెత

# లోక్‌సత్తా టైమ్స్ - కొత్త రాజకీయ పక్షపత్రిక

**మే 1-31, 2010 సంపుటి - 1 సంచిక - 9, 10**

ప్రధాన సంపాదకులు : డా॥ జయప్రకాష్ నారాయణ్

సంపాదకవర్గం : జి. రాజారెడ్డి
సి.హెచ్. మాధవరావు
గరిమెళ్ళ నారాయణ
కె.వి. కుటుంబరావు

వర్కింగ్ ఎడిటర్ : కొంగర గంగాధర రావు

ప్రచురణ కర్త : డా॥ జయప్రకాష్ నారాయణ్
ఫ్లాట్ నం. బి 504, పాషాకోర్టు, సోమాజిగూడ, హైదరాబాద్ - 500 082
ముద్రణ : కళాజ్యోతి ప్రాసెస్ ప్రై. లి., 1-1-60/5, ఆర్‌టిసి క్రాస్‌రోడ్స్, హైదరాబాద్

**పోస్ట్ బాక్స్ నెంబర్ 100, హైదరాబాద్ - 500 004**


## మన రాజ్యాంగం

1. గవర్నర్ ముఖ్యమంత్రిని నియమిస్తారు. ముఖ్యమంత్రి సలహాపై ఇతర మంత్రులను గవర్నర్ నియమిస్తారు. మంత్రులు అందరూ గవర్నర్ అనుగ్రహం ఉన్నంతవరకు తమ హోదాలలో కొనసాగుతారు.

   (ఎ) ముఖ్యమంత్రితో సహా రాష్ట్రమంత్రివర్గ సంఖ్య రాష్ట్రశాసనసభ సభ్యుల సంఖ్యలో 15 శాతంకు మించరాదు. అయినప్పటికీ రాష్ట్రమంత్రిమండలి సభ్యుల సంఖ్య ఏ రాష్ట్రములోను 12కు తగ్గరాదు. అయితే ఏ రాష్ట్రములోనైనా మంత్రివర్గ సభ్యుల సంఖ్య 15శాతంకు మించి ఉన్నట్లైతే ఈ సంవిధాన 91వ మార్పు అమలుకు వచ్చిన తేదీ నుంచి ఆరు నెలలలోపల 15 శాతంకు సరిపడు సంఖ్యకు కుదించవలెను.

2. మంత్రివర్గం సమిష్టిగా రాష్ట్ర శాసనసభకు బాధ్యులై ఉంటారు.
3. మంత్రిత్వ హోదాను స్వీకరించే ముందు గవర్నర్ సమక్షంలో ప్రతిమంత్రి రెండవ షెడ్యూల్‌లో ఉదహరించిన ప్రమాణమునూ, రహస్య గోపనమును చేయవలెను.
4. ఎవరైనా మంత్రి సరాసరి ఆరునెలల మేరకు శాసనసభ సభ్యత్వములో లేనిచో అతడు మంత్రిపదవిని కోల్పోవును.
5. మంత్రుల జీతభత్యములను అవసరమైనప్పుడల్లా రాష్ట్ర శాసనసభ ఒక చట్టము ద్వారా నిర్ణయించవచ్చును. రాష్ట్ర శాసనసభ ఏదైనా చట్టమును చేసేంతవరకూ మంత్రుల జీతభత్యములు రెండవ షెడ్యూల్‌లో ఉదహరించిన విధముగా ఉండును.

**మీరూ రాయండి :** *లోక్‌సత్తా టైమ్స్ మీ పత్రిక. పత్రికలో మీకు నచ్చినవీ, నచ్చనివీ, కోరుకుంటున్నవీ... ఏవైనా మాకు ప్రతినెలా 5వ, 20వ తేదీల్లోగా తెలియజేయండి. కొత్త రాజకీయానికి ప్రజల్ని కేంద్రబిందువుగా తీర్చిదిద్దేందుకు ఈ పత్రికను ఉపయోగించుకోండి.*

**ఆపదలు వచ్చినప్పడు సాహసంగా ఉంటే సగం విజయం సాధించినట్టే**
– ప్లాటస్

## రచనలు పంపండి

'లోక్‌సత్తా టైమ్స్' పక్షపత్రిక ఎటువంటి భావజాలంతో వెలువడుతుందో మీ అందరికీ తెలుసు, ఇందుకు అనుగుణమైన రచనల్ని ఎవరైనా నేరుగా పత్రిక చిరునామాకు పంపవచ్చు.

### లోక్‌సత్తా ప్రకటన రేట్లు

| | బ్లాక్ & వైట్ | కలర్ |
|---|---|---|
| 1/8 పేజీ (వి కార్డు) | రూ॥ 1000 | రూ॥ 1500 |
| 1/4 పేజీ | రూ॥ 2000 | రూ॥ 3000 |
| సగం పేజీ | రూ॥ 4000 | రూ॥ 6000 |
| పూర్తి పేజీ | రూ॥ 8000 | రూ॥ 12000 |
| సెంటర్ స్ప్రెడ్ | రూ॥ 12000 | రూ॥ 18000 |
| బ్యాక్‌పేజి | - | రూ॥ 20,000 |
| ఫ్రంట్ ఇన్‌సైడ్ | - | రూ॥ 15000 |
| బ్యాక్ ఇన్‌సైడ్ | - | రూ॥ 12000 |
| ఫ్రంట్‌పేజి 1/4 | - | రూ॥ 10,000 |

- ప్రకటన రుసుము Loksatta Times పేరిట హైదరాబాద్‌లో చెల్లుబాటు అయ్యే విధంగా చెక్/డిడి రూపంలో పంపగలరు.
- దయచేసి మీ ప్రకటనలు ప్రతినెలా 5వ, 20వ తేదీల్లోగా పంపించగలరు.
- ప్రకటన రుసుము ముందుగానే చెల్లించగలరు

### మీ ఫీడ్‌బ్యాక్ పంపవలసిన చిరునామా


ఎడిటర్, లోక్‌సత్తా టైమ్స్,
ఫ్లాట్ నం. బి 504, పాషాకోర్టు, సోమాజిగూడ,
హైదరాబాద్ - 500 082
ఫోన్: 040-2323 1818
loksattatimeslsp@gmail.com


### లోక్‌సత్తా టైమ్స్ చందా వివరాలు

జన రాజకీయ వాణి 'లోక్‌సత్తా టైమ్స్' పత్రిక చందాదారులుగా చేరండి... చేర్పించండి. లోక్‌సత్తా టైమ్స్ అభిమానులకు, పార్టీ సభ్యులకు ఎప్పటికప్పుడు తాజా సమాచారాన్ని అందిస్తుంది. మీ దగ్గరలోని లోక్‌సత్తా పార్టీ జిల్లా కార్యాలయాలను గాని, హైదరాబాద్‌లోని పార్టీ కేంద్ర కార్యాలయాన్ని గాని సంప్రదించగలరు. ఫోన్: 040-2323 1818.

చందా రుసుమును "లోక్‌సత్తా టైమ్స్" ఎకౌంట్ నం: 62007167836 ఎస్.బి.హెచ్., పంజాగుట్ట బ్రాంచ్, హైదరాబాద్ పేరిట ఆన్‌లైన్ క్రెడిట్ చేసి వివరాలను ఇ- మెయిల్ చెయ్యవచ్చు.

విడి ప్రతి : రు. 10
ఏడాది చందా : రు. 200
మూడేళ్ళ చందా : రు. 500


బుక్ & కవర్ డిజైన్: **సునీత అరిమిల్లి**
డి.టి.పి : **టి. జ్యోతి**

# స్థానిక ప్రభుత్వాల సాధికారతే హింసకు విరుగుడు: జేపీ

స్థానిక ప్రభుత్వాలకు నిధులు, విధులు, అధికారాలను కల్పించేందుకు రాజ్యాంగ సవరణ చేయాలని జాతీయ ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాన్ని సంపూర్ణంగా స్వాగతిస్తున్నాం.

"చాలా ఆలస్యంగా జరుగుతున్న ప్రయత్నం ఇది" 1998లో అప్పటి ఎన్డీయే ప్రధానమంత్రి ఎ.బి. వాజ్‌పేయి, కాంగ్రెస్ అధ్యక్షురాలు సోనియాగాంధీ ఇద్దరూ స్థానిక ప్రభుత్వాల సాధికారతకు పూర్తిస్థాయిలో కట్టుబడి ఉన్నామని పంచాయతిరాజ్ సమ్మేళనంలో ఒకే వేదికపై నుంచి విస్పష్టంగా ప్రకటించారు. భారతదేశంలోని రెండు జాతీయపార్టీలూ ఆ అంశంపై ఏకాభిప్రాయంతో ఉన్నప్పటికీ వారి మాటలు ఇప్పటివరకూ కార్యాచరణగా ఎందుకు మారలేదో అర్థంకావటం లేదు. స్థానిక ప్రభుత్వాల సాధికారత పట్ల వారికి నిజమైన చిత్తశుద్ధి ఉంటే, రాజ్యాంగ సవరణ తీసుకురావటానికి ఆలస్యం ఎందుకు? ఇదే డిమాండ్‌తో 2004లో లోక్‌సత్తా 1కోటీ 8లక్షల సంతకాలను సేకరించింది. నాటి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కేబినెట్ సమావేశం నిర్వహించి మరీ అధికారాలు బదిలీ చేస్తానని హామీ ఇచ్చి ఆ తర్వాత చేతులు దులుపుకున్నారు. అప్పటి ప్రతిపక్షనేత వైఎస్ రాజశేఖర రెడ్డి అధికారంలోకి వస్తే తొలి సంతకాన్ని స్థానిక ప్రభుత్వాలకు నిధులు, విధులు కేటాయించే ఫైలు మీదే పెడతానని ఆ తర్వాత మాట తప్పారు. ఈ మార్పులు రావాలని దేశంలో వ్యవస్థ గురించి అవగాహన ఉన్న ప్రతి ఒక్కరికీ తెలుసు, అయితే అందుకోసం అడుగు మాత్రం ముందుకు వేయటం లేదు. లోక్‌సత్తా ఉద్యమం, రెండో పరిపాలనాసంఘం సభ్యునిగా జేపీ చేసిన సిఫార్సులు ఆలస్యంగానైనా కార్యరూపం దాలుస్తుండటం సంతోషకరం.

పెద్దఎత్తున చెలరేగుతున్న హింసాకాండతో దేశం సంక్షోభాన్ని ఎదుర్కొంటున్న ప్రస్తుత తరుణంలో... నిధులు, పూర్తి అధికారాలున్న మూడో అంచె సమాఖ్య పాలనావ్యవస్థను ఏర్పాటుచేయటానికి ఇక ఏమాత్రం తాత్సారం చేయకూడదు. "ఈరోజు ప్రజలు నిస్పృహలో, నిస్సహాయతలో, పరాయీకరణకు గురయ్యామన్న భావనలో ఉన్నారు. ఓటరు సంక్షేమానికి ఒరగబెట్టేదేమీలేకుండా కేవలం ఐదేళ్లకోసారి వచ్చే ఓటింగ్ తంతులాగా ప్రజాస్వామ్యం మారిపోయింది. రాష్ట్ర శాసనసభ్యులు తమ నియోజకవర్గాలకు మహారాజుల్లాగా తయారయ్యారు. పార్టీలు, సిద్ధాంతాలు పూర్తిగా ఔచిత్యాన్ని కోల్పోయాయి. రాష్ట్రవనరులపై పెత్తనం కోసం కొట్లాడుకునే ముఠాల్లాగా రాజకీయ పార్టీలు మారిపోయాయి. రాజకీయ నాయకులు డబ్బును యధేచ్ఛగా, విచక్షణారహితంగా, అవగాహనారాహిత్యంతో ఖర్చు చేయటం వల్ల కొన్ని దశాబ్దాలుగా లక్షల కోట్ల రూపాయలను ఖర్చు చేస్తున్నా, పేదరికం మాత్రం తొలగిపోలేదు. విశృంఖల అవినీతి, ప్రభుత్వ సేవల్లో దారుణ వైఫల్యం, మతిలేని ప్రజాకర్షక విధానాలు... ఇవన్నీ ప్రభుత్వాలపై ప్రజలు విశ్వాసాన్ని కోల్పోయేలా చేశాయి".

"తమ జీవితాలపై తమకు నియంత్రణలేదని నిస్సహాయతకు, నిస్పృహకు లోనవటం వల్లే ఒకవర్గం ప్రజలు నక్సలిజం వైపు మొగ్గుచూపుతున్నారు. తమ ఓటు ప్రజాసంక్షేమంగా మారలేదని, తాము చెల్లించే పన్నులు తమకు సేవలుగా మారలేదని వారు నిరాశకు లోనయ్యారు. స్థానిక ప్రభుత్వాలకు అధికారాలనివ్వటానికి తీసుకొచ్చిన 73, 74వ రాజ్యాంగ సవరణల అమలు పట్ల రాష్ట్ర ప్రభుత్వాలు చిత్తశుద్ధిని, అంకితభావాన్ని ప్రదర్శించకపోవటంతో అవి కాగితాలకే పరిమితమైపోయాయి". నక్సల్స్ సమస్య కేవలం తుపాకీతో పరిష్కారం కాదు. అధికారాన్ని వికేంద్రీకరించి జనం చేతికి అధికారం ఇవ్వటం ద్వారానే సాధ్యం. స్థానికంగా తప్పుజరిగితే తగిన చర్యలు తీసుకోవటానికి అంబుడ్స్‌మన్ తరహా ఏర్పాటు చేసుకోవచ్చు.

### పాలనావ్యవస్థను సమూలంగా ప్రక్షాళన చేసి పూర్తిగా వికేంద్రీకరించాలి

### జిల్లాస్థాయిలోనే ప్రభుత్వం వల్ల విప్లవాత్మక మార్పు

రాజ్యాంగం 11, 12వ షెడ్యూళ్లలో పేర్కొన్న 'స్థానిక ప్రభుత్వాలకు అధికారాల బదిలీ'ని తప్పనిసరి చేయాలి. రాష్ట్రాలకున్న విచక్షణాధికారాల్ని తొలగించాలి. ఎంపీలకు, ఎమ్మెల్యేలకు స్థానిక ప్రభుత్వాల్లో ఎటువంటి పాత్రా ఉండకూడదు. "గ్రామీణ, పట్టణ ప్రాంతాలకు ప్రాతినిధ్యం ఉండేలా ఎన్నికైన జిల్లా కౌన్సిళ్లు ఉండాలి. జిల్లా కలెక్టర్‌ను జిల్లా కౌన్సిల్‌కు కార్యదర్శిగా చేయాలి" ఈ అధికార వికేంద్రీకరణ అంటే అవినీతి వికేంద్రీకరణ కాదు, అభివృద్ధి ఫలాల్ని ప్రజలకు చేర్చే విప్లవాత్మక మార్పు. ఇటీవల విద్య, ఆరోగ్యం రంగాల్లో చేస్తున్న కేటాయింపులు, చట్టాలు ప్రజలకు చేరాలన్నా అధికార వికేంద్రీకరణ లేకుండా సాధ్యం కాదు. కేంద్రీకృత పాలనను నడుపుతూ ఉచిత కలర్ టీవీలు, నెలకు రూ.2,000 నగదు

బదిలీ వంటి పథకాలను ప్రవేశపెట్టటం ప్రజల్ని వంచించటమే అవుతుందితప్ప వారికి నిజంగా మేలు జరగదు. మద్యం వంటి దీర్ఘకాలిక విషతుల్య సమస్యను పరిష్కరించటానికి కూడా వికేంద్రీకరణే మార్గం, మద్యం దుకాణాల నియంత్రణాధికారాన్ని స్థానిక ప్రభుత్వాలకు అప్పచెబితే ఆ సమస్యను సమర్థవంతంగా పరిష్కరించవచ్చు.

ఈ విధంగా పాలనావ్యవస్థను పూర్తిగా ప్రక్షాళన చేసి స్థానిక ప్రభుత్వాల్ని పూర్తిస్థాయిలో బలోపేతంగావించి పౌరులకు సాధికారత కల్పించటం వల్ల విప్లవాత్మక మార్పులు వస్తాయి. ప్రస్తుతమున్న కేంద్రీకృత పాలనావ్యవస్థలోని దుష్పరిణామాల్ని చాలా వరకూ నిర్మూలించవచ్చు. అయితే దీన్ని అడ్డుకోవటానికి సంప్రదాయపార్టీల పాలకులేకాకుండా, అధికారగణం కూడా అడ్డంపడుతుంది. స్థానిక ప్రభుత్వాలకు అధికారాల బదిలీ వల్ల తమ ప్రాభవం తగ్గుతుందని రాష్ట్రాలు భ్రమపడనక్కర్లేదు. పైస్థాయి నుంచి రాష్ట్రాలకు అధికారాలు బదిలీకావటం వల్ల జాతీయ ప్రభుత్వానికి అధికారాలు తగ్గలేదు, పైగా పెరిగాయి. అలాగే స్థానిక ప్రభుత్వాలకు బాధ్యతలివ్వటం వల్ల రాష్ట్రాలు ఇతర కర్తవ్యాల మీద దృష్టిపెట్టవచ్చు. జనం ఉన్నచోట, గ్రామాలలో జరగాల్సిన పనుల మీద రాష్ట్రస్థాయిలో పెత్తనం సిద్ధాంతరీత్యానేకాకుండా, ఆచరణలో కూడా వైఫల్యానికి దారి తీస్తోంది.

మూడో అంచె పాలనావ్యవస్థతో స్థానిక ప్రభుత్వాలకు అధికారాలు బదిలీ అయి జనం చేతికి అధికారం ఇవ్వటం, ఎన్నికల వ్యవస్థలో మద్యం, డబ్బు పంపిణీ వంటి అక్రమాలను నిర్మూలించి దామాషా విధానాన్ని ప్రవేశపెట్టటం, అవినీతిపరులు ఎక్కడున్నా వారి భరతం పట్టి కఠినంగా శిక్షించటంతోపాటు ఆస్తుల్ని జప్తుచేసే చట్టాన్ని అమలుచేయటం చేస్తే ఇక దేశభవిష్యత్తుకు ఢోకా ఉండదు. ■

**ఉపాధిహామీతో పాటు... అన్ని ప్రభుత్వ పథకాల్లో అవినీతిని విచారించి, చర్యలు తీసుకునేలా**

# జిల్లా అంబుడ్స్‌మెన్ వ్యవస్థను విస్తరించాలి

ఉపాధి హామీలో అక్రమాలపై చర్యలు తీసుకునేలా జిల్లా స్థాయిలో అంబుడ్స్‌మెన్ ఏర్పాటును ప్రతిపాదిస్తూ ఏప్రిల్ 21న రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వును జారీ చేసిన మీదట జిల్లా స్థాయి అంబుడ్స్‌మెన్ వ్యవస్థను కేవలం జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎన్ఆర్ఈజీఎస్) అమలులో అవకతవకలపై చర్యలకే పరిమితం చేయకుండా స్థానిక ప్రభుత్వాల్లో అన్ని రకాల అవినీతి, అక్రమాలపై విచారించి, చర్యలు తీసుకునేలా విస్తరించి బలోపేతం చేయాలి.

వివిధ ప్రభుత్వ పథకాలకింద దాదాపు రూ.2000కోట్లు జిల్లా స్థాయిలో ఖర్చు చేస్తున్నందున, కేవలం ఉపాధి హామీ అమలుకు మాత్రమే అంబుడ్స్‌మెన్‌ను పరిమితం చేయకూడదు. స్థానిక ప్రభుత్వాల స్థాయిలో ఏ పథకంలో ఏ అవినీతి జరిగినా అంబుడ్స్‌మన్ విచారించి, చర్యలు చేపట్టే అధికారం ఉండాలి.

ప్రస్తుతం రాష్ట్రప్రభుత్వం తాజాగా జారీ చేసిన ఉత్తర్వు ప్రకారం ఉపాధి హామీ పథకంలో సామాజిక తనిఖీ పేర్కొన్న అవకతవకలపై విచారణకు మాత్రమే అంబుడ్స్‌మెన్ అధికారాలు పరిమితం "స్థానిక ప్రభుత్వాల స్థాయిలో ఎన్నికైన ప్రతినిధులు, అధికారులపై అవినీతి, అధికార దుర్వినియోగం ఆరోపణల మీద కూడా విచారణ చేపట్టి చర్యలు తీసుకునేలా అంబుడ్స్‌మెన్ అధికారాల పరిధిని విస్తరించాలి. దీనివల్ల అక్రమాలకు పాల్పడ్డవారిపై ఫిర్యాదులు చేయటానికి, సుమోటోగా స్వీకరించటానికి, ఏ రకమైన సంబంధిత విచారణ మీదైనా తదుపరి చర్యలు చేపట్టటానికి, దోషులుగా తేలినవారికి శిక్ష, పరిహారం విధించి, అమలు చేయటానికి, క్రమశిక్షణాచర్యలు తీసుకోవటానికి అంబుడ్స్‌మెన్‌కు అవకాశం ఏర్పడుతుంది. దోషులుగా రుజువైన ఎన్నికైన ప్రజాప్రతినిధుల్ని, స్థానిక ప్రభుత్వాల అధికారుల్ని పదవి నుంచి తొలగించి తగిన శిక్ష విధించేలా స్వయంప్రతిపత్తి, అధికారం అంబుడ్స్‌మెన్‌కు ఉండాలి".

రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వులో ఫస్ట్ క్లాస్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ స్థాయివారిని జిల్లా స్థాయి అంబుడ్స్‌మెన్‌గా ఎన్నిక చేయాలని పేర్కొన్నారు. అయితే జిల్లా జడ్జి స్థాయి వ్యక్తులను మాత్రమే అంబుడ్స్‌మెన్‌గా ఎంపిక చేయాలి. అలాగే ఒక అంబుడ్స్‌మన్‌కు ప్రభుత్వం సిట్టింగ్ ఫీజు కింద ప్రతిపాదిస్తున్న రూ.500 మరీ తక్కువ, దానివల్ల నిపుణులైనవారు ముందుకొచ్చే అవకాశముండదు. అంబుడ్స్‌మెన్ జిల్లా స్థాయిలో, ఉప జిల్లా స్థాయిలో అన్ని ప్రభుత్వ పథకాలకు సంబంధించిన ఫిర్యాదుల్ని పర్యవేక్షించి విచారణ నిర్వహిస్తుంటారు కాబట్టి వారికి సిట్టింగ్ జడ్జికి ఉండే స్థాయి, ర్యాంకు, జీతభత్యాలు, ఇతర సదుపాయాలు ఉండాలి.

ప్రజాసేవకుల అక్రమాలపై విచారణకు అనేక రకాల ఏజెన్సీలను తొలగించి వాటన్నిటి పని పరిధిని ఏకీకృతం చేయాలి. ఇందుకోసం జిల్లా స్థాయి అంబుడ్స్‌మెన్ వ్యవస్థను రాష్ట్రస్థాయిలో తగిన, స్వయంప్రతిపత్తిగల వ్యవస్థ పరిధిలోకి ఏకీకృతం చేయాలి. ■

# పాఠశాలల విలీనానికి బదులు ఓచర్ పాఠశాలలుగా మార్చండి

- డి.వి.వి.ఎస్.వర్మ

మన రాష్ట్రంలో పాఠశాలలలో ఒక చిత్రమైన పరిస్థితి వుంది. గ్రామాలలో వాడవాడలా పాఠశాలలున్నాయి. లక్షల సంఖ్యలో ఉపాధ్యాయులు, విద్యావలంటీర్లు వున్నారు. కాని పాఠశాలల్లో తగినంత మంది పిల్లలు వుండడం లేదు. మధ్యాహ్న భోజన పథకం వున్నా మంది మాత్రం పెరగడం లేదు. ఆయా ప్రాంతాలలో పిల్లలు లేక కాదు, తల్లిదండ్రులకు ప్రభుత్వ పాఠశాలలమీద నమ్మకం లేకపోవడమే ప్రధాన కారణంగా కనిపిస్తున్నది. అందుకే ఎదురుగా పాఠశాల వున్నా డబ్బులు పోసి తమకు అందుబాటు ఫీజులతో వున్న ప్రయివేటు బడ్జెట్ పాఠశాలలకు పిల్లల్ని పంపించడానికే ఆసక్తి చూపిస్తున్నారు.

ఇటీవల పత్రికలలో వచ్చిన వార్తల ప్రకారం రాష్ట్రంలో 57,028 ప్రాథమిక పాఠశాలలున్నాయి. ఇందులో 10లోపు మంది పిల్లలు మాత్రమే వున్న పాఠశాలల సంఖ్య 3,196 కాగా 30 మందిలోపు వున్న పాఠశాలల సంఖ్య 16,844గా గణాంకాలు తెలియజేస్తున్నాయి. అత్యధిక గ్రామాలలో ఒక కిలోమీటరు పరిధిలోనే ఒకటికి మించి పాఠశాలలు వున్నాయి.

ఇక పరిస్థితిని మరింత లోతుగా అర్థం చేసుకోడానికి సర్వశిక్ష అభియాన్ వారి లెక్కల ప్రకారం ఈ రాష్ట్రంలో 2007-2008 సంవత్సరం నాటికి 54,211 ప్రాథమిక పాఠశాలలు, 11930 అప్పర్ ప్రైమరీ పాఠశాలలు మొత్తం మీద 66,141 ఉన్నాయి. ఇక ఉపాధ్యాయుల సంఖ్య ప్రాథమిక పాఠశాలలలో 1,11,921 కాగా, అప్పర్ ప్రైమరీలలో 58078 మంది ఉపాధ్యాయులున్నారు. అలాగే విద్యా వలంటీర్లు ప్రాథమిక పాఠశాలలలో 24,872 మంది, అప్పర్ ప్రైమరీలలో 23,770 మంది వున్నారు. ఇక పిల్లల సంఖ్య చూస్తే, ప్రాథమిక పాఠశాలలలో 32,36,091 మంది, అప్పర్ ప్రైమరీలలో 17,51,736 మంది మొత్తం మీద 49,87,827 మంది పిల్లలున్నారు.

అంటే ప్రతిపాఠశాలకీ సరాసరి 75 మంది పిల్లలున్నారు. ప్రతి పాఠశాలకీ 3.30 మంది ఉపాధ్యాయులు, విద్యావలంటీర్లు వున్నారు. ఉపాధ్యాయుల పిల్లల నిష్పత్తి 1:23గా ఉంది. ప్రభుత్వ పాఠశాలలలో ఇప్పుడు చదువుతున్న పిల్లలలో అత్యధిక సంఖ్యాకులు బడుగు, బలహీనవర్గాలకి చెందిన వారే. ఇక కార్పొరేట్ ప్రయివేటు బడ్జెట్ పాఠశాలలో నెలకి 100 లేదా 50 రూపాయలు ఫీజులు కూడా చెల్లించలేని కుటుంబాల వారి పిల్లలే.

ఈ పాఠశాలలో విద్యా ప్రమాణాలు అత్యల్పంగా వున్నాయని ఇటీవల అసర్ సర్వేకూడా స్పష్టం చేసింది. కనీసం 2వ తరగతి స్థాయిగల పిల్లలు చిన్న వాక్యాలను చదవలేని స్థితి, చిన్న లెక్కలు చేయలేని స్థితి 6-14 సంవత్సరాల పిల్లలలో సగంపైగా వుండడం కంటే దారుణం మరొకటి వుండదు. బడుగు బలహీనవర్గాల పిల్లలకి ఉచిత విద్యా సేవలో పాఠశాలలున్నాయే తప్ప ఆ పిల్లలకు చదువు అందడం లేదనేది స్పష్టం. ఈ పరిస్థితులలో ప్రభుత్వం తక్కువ విద్యార్థులున్న పాఠశాలలను విలీనం చేయాలని తలపెట్టింది. ప్రతి కిలోమీటరు పరిధిలో ఒక స్కూలు వుండేలా, ప్రతి పాఠశాలలో 20 మంది విద్యార్థులుండేలా చూడాలని, తర్వాత ఖాళీ అయ్యే పాఠశాలలను మూసివెయ్యడం లేదా ప్రీ ప్రైమరి స్కూళ్లుగా మార్చడం చేయాలని భావిస్తున్నది. కొత్తగా ప్రభుత్వం ప్రీ ప్రైమరి స్కూళ్లను ప్రారంభించినా అవి పాత పాఠశాలల మూసలోనే పనిచేస్తాయి. విద్యాప్రమాణాలు పెంచడానికి దోహదపడకపోగా అవి అదనపు భారంగా మారి గుదిబండలవుతాయి.

ప్రస్తుత పాఠశాలల పరిస్థితి ఇలా వుంటే ఇప్పుడు విద్యాహక్కు చట్టం అమలు చెయ్యాల్సివుంది. బడి బయటవున్న లక్షలాది మంది పిల్లల్ని పాఠశాలలోకి తీసుకురావాలి. ఈ పరిస్థితులలో విలీనాలు, మూసివేతలు, లేదా ప్రీ ప్రైమరి స్కూళ్లుగా మార్చడం ఈ ప్రభుత్వానికి సాధ్యం కాకపోవచ్చు.

అందుచేత విద్యాహక్కు చట్టం అమలును దృష్టిలో పెట్టుకుని ఈ స్కూళ్లను కొనసాగించాల్సి వచ్చినా, ముందుగా ప్రస్తుత ప్రభుత్వ పాఠశాలలను క్రమబద్ధం చెయ్యాలి. 20 మంది పిల్లలలోపు వున్న సుమారు 16,000 పాఠశాలల మీద సముచితమైన నిర్ణయం తీసుకోవాలి. ఈ పాఠశాలలను కొత్త పద్ధతిలో నిర్వహించడానికి దీనిని ఒక అవకాశంగా ప్రభుత్వం వినియోగించుకోవాలి.

ప్రస్తుతం మన పాఠశాలలలో ఎవరికీ ఎలాంటి జవాబుదారీతనం లేదు. పాఠశాలల్ని అజమాయిషీ చేసే యంత్రాంగం ఉపాధ్యాయుల పదోన్నతుల ద్వారా ఏర్పడిన వ్యవస్థ కావడంతో లాలూచీ అజమాయిషీ లేదా అవినీతి అజమాయిషీగా మారింది. అలాగే పాఠశాలలలో పనిచేసే ఉపాధ్యాయుల వేతనాలకీ విద్యార్థుల చదువుకీ లంకే లేదు. చెప్పినా చెప్పక పోయినా, పాఠశాలలకు హాజరైనా, డుమ్మాకొట్టినా జీతాలకి ఢోకాలేని పరిస్థితి వచ్చింది. ఫలితాలు సాధించేవారికీ సాధించనివారికీ మధ్య తేడా లేకపోవడం పోటీతత్వం లేని నిస్సారమైన వ్యవస్థని సృష్టించింది. అంతకుమించి ఈ ప్రభుత్వ పాఠశాలలలో తల్లిదండ్రులు ఎంచుకోడానికి అవకాశాలులేవు.

ఉన్నా రెండు చోట్లా పరిస్థితి అదే. అందుచేతనే వారు ప్రైవేటు బడ్జెట్ పాఠశాలకు పోక తప్పడం లేదు.

ఇలాంటి పరిస్థితులలో ఈ పాఠశాలలో జవాబుదారీతనాన్ని, ఫలితాలకితగ్గ జీతాల వ్యవస్థని, తీసుకురావడం చాలా కష్టసాధ్యం. ఉపాధ్యాయ సంఘాలు, వాటిమీద నిలబడిన యం.యల్.సీ.లు అందరూ టీచర్ల హక్కుల పక్షమేగాని, బాధ్యతల భారం వహించడంలేదు. ప్రభుత్వాలు వాటికి తలొగ్గక తప్పడంలేదు. అందుచేత ప్రస్తుత పాఠశాల వ్యవస్థలో ప్రమాణాల పెంపుచేసే సంస్కరణలు వచ్చే అవకాశం లేదు. తెచ్చే చేవ ప్రభుత్వాలకి లేదు. దీనికి బలవుతున్నది బడుగు బలహీనవర్గాల పిల్లలే.

అందుచేత మూసివేత తప్పనిసరి అవుతున్న సూమారు 16,000 పాఠశాలలలో ప్రభుత్వం కొత్త పద్ధతి పాఠశాలలకు పూనుకోవడం విద్యావ్యవస్థలో జవాబుదారీతనానికి మార్గం అవుతుంది. ఈ 16 వేల పాఠశాలలలను "ఓచర్ పాఠశాలలుగా" ప్రభుత్వం మార్చాలి. అంటే ఇక్కడ విద్యార్థుల సంఖ్యను బట్టి జీతాలు చెల్లించే పద్ధతిని ప్రవేశ పెట్టాలి. అంతకుమించి ఈ పాఠశాలలలో ప్రతి సంవత్సరం విద్యార్థులకు లభించే గ్రేడులను బట్టి ఉపాధ్యాయులకు అదనపు ప్రోత్సాహకాలను అందించాలి.

ఈ పాఠశాలల నుండి రెగ్యులర్ ఉపాధ్యాయులను 30మందికి పైన పిల్లలు వున్న పాఠశాలలకు బదిలీ చెయ్యాలి. ఉపాధ్యాయులు లేకుండా ఖాళీగా మిగిలిపోయిన పాఠశాలలను విద్యావలంటీర్లకు, శిక్షణ పొంది ఉపాధికోసం ఎదురుచూస్తున్న వారికి, ప్రత్యేకంగా స్థానికులకు అప్పగించాలి. ఈ పాఠశాలలలో ఎంత మంది విద్యార్థులుంటే ప్రతీ విద్యార్థికి 150 రూపాయలు చొప్పున వారికి చెల్లించాలి ఇది ఒక ఉదహరణ మాత్రమే. సంవత్సరాంతం ఈ పాఠశాలను తెచ్చుకునే గ్రేడ్ అధారంగా ప్రతి గ్రేడ్‌కు అదనంగా ప్రతి విద్యార్థికి 50 రూపాయాల ప్రోత్సాహకం చెల్లించాలి. ఈ పాఠశాలలను స్థానిక పంచాయితీలు, నియమించే యజమాన్యాలు పర్యవేక్షించాలి. పాఠశాల ప్రమాణాలను ప్రతి ఏటా మదింపు చెయ్యడానికి సాంకేతికంగా నైపుణ్యం గల స్వతంత్ర సంస్థను ఏర్పాటు చేసి దానికి అప్పగించాలి. తల్లిదండ్రులు తమకు నచ్చిన ప్రభుత్వ లేదా ఓచర్ పాఠశాలలో పిల్లల్ని చేర్పించే వీలుండాలి. అప్పుడు ఎవరు బాగా విద్యను అందిస్తే వారి దగ్గరకు విద్యార్థులు వెళ్లడానికి వీలుంటుంది. ఇదే ఖర్చుతో బోధన పాఠశాలలో అదనంగా ఇంగ్లీష్ భాష నేర్పించడం కూడా సాధ్యం అవుతుంది.

ఇందువల్ల కనీసం 7,8 లక్షల మంది బడుగు, బలహీన వర్గాల పిల్లలకి ప్రస్తుత పాఠశాలలలోకంటే మెరుగైన విద్యను ఈ ఓచర్ పాఠశాలల ద్వారా అందించడం సాధ్యపడుతుంది. వారు తమ గ్రేడ్‌లని, జీతాలని పెంచుకోడానికి పోటీపడతారు. అలాంటి పోటీ లేకుండా ప్రాథమిక విద్యకు చికిత్స అసాధ్యం.

పిల్లలు తక్కువ వున్న పాఠశాలల స్థానంలో విద్యార్థుల సంఖ్యను బట్టి, చదువు ప్రమాణాన్ని బట్టి జీతాలు చెల్లించే కొత్త వ్యవస్థ – "ఓచర్ పాఠశాలల వ్యవస్థ"కి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. ■

# పౌరులు - ప్రాధమిక బాధ్యతలు

## ప్రతి పౌరుడు ఈ క్రింది బాధ్యతలను మనసారా స్వీకరించి బాధ్యతాయుతంగా ప్రవర్తించవలెను

**ఎ)** రాజ్యాంగ శాసనబద్ధుడై యుండుట. శాసనమండలి ఆశయములనూ, శాసనం స్థాపించే సంస్థలనూ, జాతీయ పతాకాన్ని, జాతీయ గీతాన్ని అంకితభావంతో గౌరవించుట. **బి)** స్వాతంత్ర్యోద్యమ స్ఫూర్తితో అన్ని రంగాలలో వ్యవహరించుట. **సి)** దేశ సార్వభౌమత్వాన్ని, సమన్వయతనూ, సమగ్రతను రక్షించుట. **డి)** దేశరక్షణలో అనుక్షణం సంసిద్ధుడై ఉండుట. **ఇ)** ప్రజా జీవనంలో అన్యోన్యతనూ, భాతృభావాన్ని పోషించుట, మత, భాష ప్రాంతీయతత్వాలకు వర్గవైరుధ్యములకు అతీతముగా ఉండుట. స్త్రీలను అగౌరవపరచే ఆచారములను విడనాడుట. **ఎఫ్)** అమూల్యమైన భారతీయ చారిత్రక సంపదనూ, సుసంపన్న సంస్కృతినీ పరిరక్షించుట. **జి)** పర్యావరణాన్ని అడవులను, కొలనులనూ, నదులనూ రక్షించుట, అభివృద్ధి పరచుట, మృగరక్షణ, జలజంతు జీవరాసులపై కరుణార్ద్రత. **(హెచ్)** శాస్త్రీయ మరియు మానవతా దృక్పథాలను అలవరుచుకొనుట, జిజ్ఞాసను పెంపొందించుకొనుట, సంస్కరణ తత్వమును పెంపొందించుట. **ఐ)** హింసను విడనాడుట, ప్రజల ఆస్తుల విధ్వంసం చర్యలను నిరోధించుట. **జె)** వ్యక్తిత్వ శక్తి సామర్థ్యాల ఔన్నత్యాన్ని పెంపొందించుకొనుట ద్వారా మరియు సమిష్టి కృషి ద్వారా అన్ని రంగాలలో గణనీయమైన స్థాయిని చేరుటకొరకు, శిఖరాగ్ర సాధనకొరకు నిరంతరం కృషి సల్పుట. **కె)** రక్షకులు లేదా సంరక్షకులుగా ఉన్నవారందరూ 6 నుంచి 14 సంవత్సరముల లోపల పసివారికి విద్యాభ్యాసము చేయు అవకాశమును కల్పించవలెను. ■

# సమాచార హక్కు చట్టం అమలు

## మనహక్కు - బాధ్యత

"ఎవరూ వెనక్కు వెళ్ళి కొత్త ప్రారంభాన్ని చేయలేరు. కాని ఎవరైనా ఈ రోజు ప్రారంభించి ఆశిస్తున్న కొత్త ముగింపుని ఇవ్వగలరు"

**విషయం :** సరూర్‌నగర్‌లోని ప్రభుత్వ ఆఫీసుల తనిఖీ

**తేది :** మార్చి 6,2010

**సందర్శించిన కార్యాలయాలు :**

1. తహసీల్దార్ కార్యాలయం 2. మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయం 3. జి.హెచ్.ఎమ్.సి.- ఎల్.బి. నగర్ సర్కిల్ కార్యాలయం.

**లక్ష్యం :** ఆర్.టి.ఐ. చట్టంలోని 4(1)బి మరియు 5(1),(2) మరియు 19(1) అమలు చేస్తున్నదీ లేనిదీ తెలుసుకోవటం.

**ఈ పైచట్టాల ప్రకారం ఈ క్రింద వివరాలు display చేయాలి.**

1. హాండ్ బుక్ (కార్యాలయం, అధికారుల వివరాల, ఉద్యోగస్థుల విధులు, బాధ్యతలు, వారి పేర్లు, జీతభత్యాలు మొ॥ వివరాలతో కూడుకొన్నది.
2. ఆఫీసు ముఖద్వారాం వద్ద బోర్డు (పౌరసమాచార అధికారి, సహాయ పౌర సమాచార అధికారి, Appellate అధికారిపేరు కార్యాలయం చిరునామా, ఫోన్‌నెంబర్లు, మొబైల్ నంబర్లు, ఫాక్స్ నెంబర్లు, E-mail చిరునామాలు)

**విధానం :** 1. ఆర్.టి.ఐ. చట్టాన్ని అమలు చేయని కార్యాలయాలపై సర్వే నిర్వహించటం, రూల్స్ పాటించని కార్యాలయాల గురించి ఫిర్యాదు చేయడం.

**Advantages :** పారదర్శకత, బాధ్యత పెంపొందించడం దీని వల్ల ప్రజలు సరియైన అధికారిని సంప్రదించవచ్చు.

**గమనించిన విషయాలు :** ఒక ఎమ్.పి.డి.ఓ. కార్యాలయంలో మాత్రమే Display board పెట్టడం జరిగింది. అయితే దానిపై ఏమీ వ్రాసిలేదు. మిగిలిన రెండు కార్యాలయాల్లో ఆ బోర్డులు కూడా పెట్టలేదు.

**తీసుకున్న చర్య :** ఆయా ఆఫీసులపై ఫిర్యాదు చేయడం జరిగింది. ఫిర్యాదులపై తీసుకున్న చర్యల గురించి. మళ్ళీ ఆర్.టి.ఐ.చట్టం క్రింద దరఖాస్తు చేయడం జరిగింది.

**ఫలితాలు :** తహసీల్దార్ ఆఫీసులో board పెట్టారు. మిగిలిన కార్యాలయాల నుంచి కూడా త్వరలో ఫలితాన్ని ఆశిస్తున్నాం.

ఈ కార్యక్రమలో గంజి శ్రీనివాసరావు, అబ్దుల్ అజీజ్, ప్రదీప్, సావన్‌బందు, ప్రవీణ్ పాల్గొన్నారు. ■

# బెంగళూరు కార్పొరేషన్ ఎన్నికల్లో పునాది వేసిన లోక్‌సత్తా

బెంగళూరు మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికలలో పోటీచేసిన ఐదు స్థానాల్లో బలమైన పునాది వేశాము. పోటీచేసిన తొలిసారే సగటున ఆరు శాతం ఓట్లను సాధించాము. బిబిఎంపిని కైవసం చేసుకున్న బిజెపి మేయర్ అభ్యర్థిగా ప్రచారం పొందిన వ్యక్తి పోటీచేసిన వసంతనగర స్థానంలో 15 శాతానికిపైగా ఓట్లు సాధించడం లోక్‌సత్తా పార్టీ వేగంగా బలపడుతోందన్నదానికి నిదర్శనం. రెండు కీలక స్థానాల్లో గతంలో కర్ణాటకను పాలించిన జనతాదళ్ (ఎస్) పార్టీకంటే ఎక్కువ ఓట్లను లోక్‌సత్తా సాధించగలిగింది. తొలి ప్రయత్నంలోనే లోక్‌సత్తా గణనీయమైన స్థాయిలో తన ప్రభావాన్ని చూపగలిగింది. రాబోయే కాలంలో మరింత ఉత్సాహంతో కర్ణాటక రాష్ట్రంలోని అన్ని ముఖ్య నగరాలు, పట్టణాల్లో లోక్‌సత్తా తన నిర్మాణాన్ని పెంచుకుని ప్రజలను చైతన్యపరిచేవిధంగా కార్యక్రమాలు రూపొందించుకుంటుంది.

డబ్బు, మద్యం పంచడం ద్వారా రాజకీయాలు నిర్వహించడం కర్ణాటకలో కూడా కొత్త కాకపోయినా .. వాటికి దూరంగా, ప్రజల్ని ఎలాంటి భ్రమలకు గురిచేయకుండా, నిజాయితీగా అడుగుపెట్టిన లోక్‌సత్తా తొలిసారే మంచి ఫలితాన్ని సాధించడం అక్కడి ప్రజలు కూడా మార్పును కోరుకుంటున్నారనేదానికి స్పష్టమైన నిదర్శనం. ■

# తప్పు సరిచేసుకున్న బి.ఎస్.ఎన్.ఎల్. అధికారులు

బీ ఎస్ఎన్ఎల్, సరూర్‌నగర్, హైదరాబాద్ కార్యాలయ అధికారుల సేవా లోపం వలన 75 సంవత్సరాల వృద్ధురాలి యొక్క రెండు సంవత్సరాల సమస్యను సరూర్‌నగర్ సిహెచ్‌సీ సమాచార హక్కు చట్టం ద్వారా రెండు నెలల్లో పరిష్కరించింది.

శ్రీమతి శారద (వయస్సు 75 సం.), బి. 63, హుడా కాలనీ, సరూర్‌నగర్, హైదరాబాద్ – 500035 వారియొక్క టెలిఫోన్ నంబరు 040–24045604. తేది 18.01.2008న రెండు వేలు ఖర్చు చేసి ఇంటర్నెట్ బ్రాండ్‌బాంగ్ కనెక్షన్ తీసుకున్నారు. కనెక్షన్ తీసుకున్న రెండు నెలలకే టెలిఫోన్ పనిచేయడం మానేసింది. రెండు సంవత్సరాలైంది. శారద గారు బీఎస్ఎన్ఎల్ అధికారులకు ఎన్నోసార్లు ఫోన్ చేశారు. సంబంధిత అధికారులు ఆమె ఇంటికి వచ్చారు. చూశారు. కానీ సమస్య పరిష్కారం కాలేదు. కుంటిసాకులు చెప్పి కాలయాపన చేశారు.

శ్రీమతి శారద తరపున సరూర్‌నగర్, సీహెచ్‌సీ తేది. 11.02.2010న జనరల్ మేనేజర్, బీఎస్ఎస్ఎల్, హైదరాబాద్ వారికి సమస్యను ఎత్తిచూపుతూ అధికారుల నిర్లక్ష్యం వలన ఆమెకు కలిగిన మానసిక వేదనకు రూ.10,000లు నష్టపరిహారం చెల్లించమంటూ, సమస్యను పరిష్కరించమంటూ ఫిర్యాదును స్పీడు పోస్టు ద్వారా పంపాము. అధికారులు స్పందించలేదు. తేది.04.03.2010న సమాచార హక్కు చట్టం కింద దరఖాస్తును హైదరాబాద్ జిల్లా డీజీఎం(ఎ)కు పంపాము. దరఖాస్తు రుసుం కింద రూ.10.00లు ఐపీవో పంపాము. అయినా స్పందించలేదు. తేది 08.04.2010న సమాచారహక్కు చట్టం 2005, సెక్షన్ 10(1) ప్రకారం మొదటి అప్పీలును హైదరాబాద్ జిల్లా పీజీఎంకు పంపాము. బీఎస్ఎన్ఎల్ అధికారులు స్పందించారు. పూర్తి సమాచారాన్ని పంపారు.

ఫిర్యాదుకు స్పందించని బీఎస్ఎన్ఎల్ అధికారులు సమాచార హక్కు చట్టం కింద దరఖాస్తు చేసిన తర్వాతనే స్పందించి నేరుగా బాధితురాలి వద్దకు వచ్చి పనిచేయని విల్ ఫోన్ బదులు కొత్త ఫోన్ అమర్చారు. బ్రాడ్‌బాండ్ ఇంటర్నెట్ కనెక్షన్ తీసుకున్నప్పుడు కొనుగోలు చేసిన రూ॥ 2,000/- విలువగల మోడెం ఖరీదు డబ్బును తిరిగి చెల్లిస్తామని తేది. 10.04.2010న సీహెచ్‌సీకి వచ్చిన సమాచారంలో పేర్కొన్నారు.

రెండు సంవత్సరాలుగా వినియోగదారుల సమస్యను పట్టించుకోని, సమాధానమీయని అధికారులు సమాచారహక్కు చట్టం కింద దరఖాస్తు చేసిన తర్వాత తమ బాధ్యతను గుర్తించి తప్పును సరిచేసుకున్నారు. శ్రీమతి శారద సమస్యను పరిష్కరించారు. ■

**(పౌరసహాయ కేంద్రం, సరూర్‌నగర్)**

### రాష్ట్రంలో ఆర్.టి.ఐ. చట్టం పూర్తిస్థాయి అమలుకోరుతూ

# హైకోర్టులో పిటీషన్

గౌరవ ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ధర్మాసనం ఎదుట రిట్‌పిటిషన్ నెం.డబ్ల్యు.పి.9849/2010 వాదులు 1.గంజి శ్రీనివాసరావు, 2. షేక్ అబ్దుల్ అజీజ్, 3. రమేష్ భూపతి. వేయటం జరిగింది. రైట్ టు ఇన్‌ఫర్మేషన్ (ఆర్.టి.ఐ) చట్టం వచ్చి ఐదేళ్ళయినా రాష్ట్రంలో ఇంకా పూర్తిగా అమలు కాకపోవటాన్ని ప్రశ్నిస్తూ దాఖలయిన ఈ రిట్‌పిటీషన్‌ను గౌరవ ప్రధాన న్యాయమూర్తి శ్రీ నిస్సార్ అహ్మద్ కక్రూ మరియు గౌరవ న్యాయమూర్తి సంజయ్ కుమార్‌లు 29/04/2010న విని ప్రతివాదులు అయినటువంటి (1) ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము తరపున ప్రిన్సిపల్ సెక్రటరీ, ఛీఫ్ ఇన్‌ఫర్మేషన్ కమీషనర్, ఆంధ్రప్రదేశ్ ఇన్‌ఫర్మేషన్ కమీషన్, హాక్‌భవన్, 3. కేంద్రప్రభుత్వం తరపున, కార్యదర్శి, పర్సనల్ ట్రైనింగ్ విభాగము, వారికి నోటీసులు జారీ చేయటం జరిగింది.

**పిటీషన్‌లోని ప్రధాన విన్నపము**

ఆర్.టి.ఐ. చట్టం నెం.22/2005లోని సెక్షన్స్ 4(1) (ఎ) మరియు 4(1) (బి), 4(4), 7(1), 19(8) (బి), 20(1), 20(2)లను అమలు చేయకపోవడాన్ని రిట్ ఆఫ్ మాండమస్ ప్రకారం చట్టవిరుద్ధమైనదిగా, ఏకపక్షమైనదిగా రాజ్యాంగంలోని ఆర్టికల్ 14 మరియు 19(1) (ఎ)ల ఉల్లంఘనగా మరియు ఆర్.టి.ఐ.చట్టం 2005లోని నిబంధనల ఉల్లంఘనగా నిర్ధారించి ప్రతి వాదులు ఆర్.టి.ఐ. చట్టం, 2005లోని సెక్షన్స్ 4(1) (ఎ) మరియు 4(1) (బి), 4(4), 7(1), 19(8) (బి), 20(1), 20(2) అమలు చేసేలా ఉత్తర్వులు ఇవ్వాలని కోరుతూ విన్నపం. ■

# నీటి ప్యాకెట్లపై ISI గుర్తు దుర్వినియోగం

నీరు జనజీవనానికి ఎంత అవసరమో మనందరికీ తెలుసు. గత కొన్ని దశాబ్దాలుగా నీటి వినియోగం పెరిగి చాలా చోట్ల నీటిస్థాయి పడిపోయింది. మంచినీటి లభ్యత ఇప్పుడు కలగానే, రాజకీయ నాయకుల నినాదంలానే మిగిలిపోతోంది. తగినంత మంచినీరు, తగిన సమయంలో తగిన చోట ఇవ్వడం ఆరోగ్యానికి, ఉల్లాసానికి, ఆర్థిక ప్రగతికి తోడ్పడుతుంది. ఈ విషయాల్ని దృష్టిలో ఉంచుకొని హైదరాబాదులోని వివిధచోట్ల సీసాల్లో, ప్యాకెట్లలో లభ్యమవుతున్న నీటి నాణ్యతపై లోక్‌సత్తా పౌరసహాయకేంద్రం తనిఖీలు నిర్వహించింది.

మా తనిఖీలు, పరిశోధనల తర్వాత చట్ట విరుద్ధంగా నీటిని తయారుచేస్తున్న కంపెనీలను గుర్తించాం. వీరు ఐఎస్ఐ గుర్తుని చట్ట విరుద్ధంగా వాడుతున్నారు.

**పూర్తివివరాలు.**

**విషయం :** హైదరాబాదు, రంగారెడ్డి మెదక్ జిల్లాలో Indian standards Act 1986ని ఉల్లంఘిస్తూ ప్యాకెట్లు, సీసాలు, కాన్‌లతో నీటిని తయారు చేయడం పై సర్వే.

**సమయం : మార్చినెల, 2010**

**స్థలం :** నగరంలోని 60 చోట్ల నుంచినీటి శాంపిల్స్ సేకరించడం జరిగింది.




**లక్ష్యం :**

1. చట్ట విరుద్ధంగా నీటిని అమ్మడాన్ని నియంత్రించడం.
2. ఐఎస్ఐ గుర్తు దుర్వినియోగాన్ని నివారించటం.
3. ప్రజల ఆరోగ్యాన్ని కాపాడటం.

ప్రభుత్వ ఉత్తర్వుల వివరాలు Bureau of Indian standards (BIS) చట్టాన్ని అనుసరించి ప్రతీ తయారీదారుడు బిఐఎస్ నుండి అనుమతి తీసుకోవాలి.

**విధానం :**

1. a) http://nicde.nic.in/CMMS/InternetRep/HORepList Of Licences.aspx?Report=14

   b) http://www.bis.org.in/formoredetailsonBISActand Rules వెబ్‌సైట్‌ల ద్వారా ఎవరెవరు లైసెన్సులు తీసుకున్నారో తెలుసుకోవచ్చు.
2. దగ్గరలోని కూల్‌డ్రింక్ షాపులో, పాన్‌షాపులో, బస్‌స్టేషన్‌లలో నీళ్ళ బాటిళ్ళు, పాకెట్లు కొనడం
3. ఆ నీళ్ళ ప్యాకెట్ల పై ఐఎస్ఐ మార్క్ ఉందేమో చూడటం. మరిన్ని వివరాల కోసం http://bis.org.in/other/enf.pdf చూడండి.
4. తయారీదారు పేరు, చిరునామా, అనుమతి పత్రమును బి.ఐ.ఎస్. గుర్తుని తనిఖీ చేయడం
5. ఆన్‌లైన్‌లో http://www.bis.org.in/cad/ complain.htm కి ఫిర్యాదు చేయడం లేదా మెయిల్ చేయడం.
6. ఫిర్యాదుపై తీసుకొన్న చర్యల వివరాలు గురించి ఆర్.టి.ఐ క్రింద అప్లికేషన్ పెట్టడం.

**కార్యక్రమం :** హైదరాబాద్ మరియు రంగారెడ్డి జిల్లాల్లో బిఐఎస్ అనుమతి వున్న సంస్థల వివరాలు సేకరించడం జరిగింది.

రంగారెడ్డిలో 60 ప్లాంట్లలకు హైదరాబాద్ జిల్లాలో 18 ప్లాంట్లకు అనుమతి వుందని తేలింది. చాలా ప్లాంట్లు చట్టవిద్ధంగా అనుమతి లేకుండా **ఐఎస్ఐ** గుర్తు వాడుతుడటం గమనించడం జరిగింది. ఈ చట్టవిరుద్ధ నీటి విక్రయం ఆర్టిసిలో, పాన్‌షాపుల్లో, కూల్‌డ్రింక్‌షాపుల్లో, నీటి అమ్మకపు కియోస్కలలో, వైన్‌షాపులో, సినిమాహాళ్ళలో జరుగుతోంది.

వాటి వివరాలు సేకరించి బిఐఎస్‌కు ఫిర్యాదు చేయడం జరిగింది. చట్ట విరుద్ధ సంస్థలపై బిఐఎస్ యాక్ట్ 1986 సెక్షన్ 33 క్రింద చర్యలు తీసుకొని రాష్ట్రంలోని లక్షల ప్రజల ఆరోగ్యాన్ని రక్షించవలసిన బాధ్యతని గుర్తు చేయడం జరిగింది. వెంటనే తగిన చర్యలు తీసుకుంటామని బిఐఎస్ అధికారులు తెలపడం జరిగింది.

**ఉపయోగాలు**

1. చట్టవిరుద్ధ కార్యకలాపాలు అరికట్టబడతాయి.
2. అవినీతిని గుర్తించి అరికట్టబడుతుంది.
3. ప్రజల ఆరోగ్యం పరిరక్షించబడుతుంది.

మనం నీరెంత ముఖ్యమో గుర్తించాం కాని, గౌరవించటం నేర్చుకోలేదు. సమాజంలో ఈ సమస్యపై అవగాహన పెంచాల్సిన బాధ్యతపై మనందరి పైనా వుంది. అంతా కలిసి ఈ సమస్యను ఎదుర్కొన్నట్లయితే ఎక్కడికక్కడ ఈ సమస్య పరిష్కరించ బడుతుంది. రండి. చేయి చేయి కలుపుదాం.

ఈ కార్యక్రమంలో పాల్గొన్న సీపీహెచ్‌సీ టీం సభ్యుల పేర్లు

1. జి. శ్రీనివాసరావు 2. అజీజ్, 3. ప్రదీప్, 4 కిశోర్, 5. కిరణ్

**కాంటాక్ట్ నంబరు 95735 93573** ■

# ఉపాధి హామీలో మంత్రిపై ఆరోపణల మీద లోక్‌సత్తా నిజనిర్ధారణ కమిటీ

పేదల జీవనోపాధికి నేరుగా ఎంతోకొంత ఆసరానిచ్చే జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం అమలులో జరుగుతున్న అవకతవకల్లో సాక్షాత్తూ రాష్ట్ర మంత్రుల పేర్లు వినిపించటం తీవ్రంగా పరిగణించదగ్గ విషయం. ప్రజాధనం దుర్వినియోగం చేసిన వారు ఏ స్థాయిలోని వారైనా చర్యలు తీసుకోవాల్సిందే. తూర్పుగోదావరి జిల్లా తాళ్లరేవు మండలం చొల్లంగి పంచాయతీ పరిధిలో గ్రామీణాభివృద్ధి, ఉపాధి కల్పన శాఖల మంత్రి వట్టి వసంతకుమార్ తన చేపల చెరువుల కోసం ఉపాధి హామీ పథకం కింద నిధుల్ని దుర్వినియోగం చేసి రోడ్లు వేయించుకున్నారన్న ఆరోపణలపై నిజనిర్ధారణకు పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ ఆధ్వర్యంలో నలుగురు సభ్యులతో ఒక కమిటీని లోక్‌సత్తా పార్టీ ఏర్పాటుచేసింది. కమిటీలో తూర్పుగోదావరి జిల్లా పార్టీ అధ్యక్షుడు జి. రామరాజు, రాజమండ్రి జోన్ ఇంఛార్జి చంద్రకళ, కాకినాడ జోన్ ఇంఛార్జి కరణం వెంకటేశ్వరరావు, కాకినాడ అర్బన్ పార్టీ కార్యదర్శి నెక్కంటి శ్రీనివాస్ సభ్యులుగా ఉన్నారు. చొల్లంగి పంచాయతీని సందర్శించి నిధులు దుర్వినియోగమైన తీరు, అందులో ప్రమేయమున్న నేతలు, అధికార యంత్రాంగం గురించి వివరాలను ఆ కమిటీ తెలుసుకుని వారంరోజుల్లోగా పార్టీ రాష్ట్ర కార్యాలయానికి నివేదిస్తుంది.

ఉపాధి హామీ పథకం ప్రారంభమై నాలుగేళ్లు దాటినా ఇప్పటికీ ఆ పథకం అమలుపై రాష్ట్రానికి సరైన ప్రణాళిక లేదు, రాష్ట్రంలో కేవలం కొన్ని జిల్లాల్లో మాత్రమే వాస్తవంగా అమలవుతోంది. ఆయా జిల్లాల్లో కూడా చాలాచోట్ల అధికార, ప్రతిపక్ష నేతలు కుమ్మక్కయి పనుల ఎంపికలో, వేతనాల పంపిణీలో అవకతవకలకు పాల్పడుతున్నారు. వట్టి వసంతకుమార్ మీదే కాకుండా ఇతర జిల్లాల్లో మరికొందరు మంత్రుల మీద కూడా ఆరోపణలు వస్తున్నాయి. పథకం అమలులో సామాజిక ఆడిటింగ్ కూడా నామమాత్రంగా జరుగుతోంది. అవకతవకల ఆరోపణల మీద విచారణ జరిపితే రాజకీయ దోషుల్ని వదిలేసి కేవలం పార్ట్‌టైంగా పనిచేసే ఫీల్డు అధికారుల్ని మాత్రమే సస్పెండ్ చేసి చేతులు దులుపుకుంటున్నారు. ఉపాధి హామీ పథకం అమలులో అక్రమాలపై చర్యలకు ప్రతి జిల్లాలో ఆంబుడ్స్‌మన్‌ను ఏర్పాటు చేయాలి. చట్టం విధివిధానాలు పేర్కొంటున్నా అమలు చేయకుండా రాష్ట్ర ప్రభుత్వం తాత్సారం చేస్తోంది. ఫలితంగా అవినీతి జడలు పరుచుకుంటోంది. ప్రభుత్వం వెంటనే స్వతంత్ర ప్రతిపత్తి గల ఆంబుడ్స్‌మన్‌ను విధిగా ప్రతి జిల్లాకూ ఏర్పాటు చేయాలి. పనుల అమలును పంచాయతీలకే కేటాయించాలనే మౌలిక నిబంధనకు తూట్లు పొడిచి, ఆ పనులను తమకు నచ్చినవారికే కేటాయించుకుంటున్న నేతలు, వారికి సహకరిస్తున్న అధికారగణంపై కఠిన చర్యలు తీసుకోవాలి. ■

# 'స్థానిక' సాధికారతకై ప్రజాపథంలో సర్కారును నిలదీయండి
# పార్టీ శ్రేణులకు లోక్‌సత్తా పిలుపు

స్థానిక ప్రభుత్వాలకు సాధికారత కల్పించి ప్రతి పౌరునికీ తలసరి కొంత మొత్తాన్ని కేటాయించి ప్రజలే ఎన్నుకున్న కమిటీలకు అధికారాలనిస్తే ప్రజాపథం వంటి కార్యక్రమాలు అక్కర్లేదు, ప్రజాసమస్యల పరిష్కారం పేరుతో ముఖ్యమంత్రి, మంత్రులు, ఎమ్మెల్యేలు మండుటెండలో కష్టపడి రాష్ట్రంలో తిరగాల్సిన అవసరం ఉండదు. ప్రజాపథంలో లేవనెత్తాలని నిర్దేశించిన అంశాలన్నీ దాదాపు స్థానిక ప్రభుత్వాల పరిధిలోనివే. రాష్ట్ర ప్రభుత్వం తాను చేయాల్సిన బాధ్యతల్ని వదిలేసి స్థానిక ప్రభుత్వాల పనుల్ని కూడా తానే చేస్తూ పెత్తనం చెలాయిస్తుండటం వల్లే ఈవేళ ఆర్భాటపు కార్యక్రమాలకు ప్రజాధనం దుర్వినియోగం అవుతోంది. అయితే ప్రస్తుత కేంద్రీకృత పాలనావ్యవస్థలో సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు ప్రజాపథం వంటి కార్యక్రమాలు తప్ప వేరే మార్గం లేదు కాబట్టి, కార్యక్రమంలో పాల్గొని సమస్యల్ని నివేదించాలని పార్టీ శ్రేణులకు లోక్‌సత్తా పార్టీ విజ్ఞప్తి చేసింది. ముఖ్యంగా ధరల పెరుగుదలకు తోడు ప్రజల ఆదాయాన్ని హరిస్తున్న మద్యం బెల్టుషాపులపై గళం విప్పాలి. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం అమలులో అవకతవకలు, అవినీతిపై, ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల తీరుపై, పారిశుద్ధ్యంపై నిలదీయాలి. ఇప్పటివరకూ నిర్వహించిన ప్రజాపథం కార్యక్రమాల్లో గుర్తించిన సమస్యలను ఎందుకు పరిష్కరించలేదో అడగాలి.

మరోవైపు, స్థానిక సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల దయాదాక్షిణ్యాల మీద ఆధారపడాలని చెబుతున్న ప్రభుత్వ వైఖరిని గట్టిగా నిలదీయాలి. స్థానిక ప్రభుత్వాలకే అధికారాలనిస్తే బెల్టుషాపుల్ని నిర్మూలించి మద్యం అమ్మకాల్ని ప్రజలే నియంత్రించుకుంటారని, తాగునీరు, ఆరోగ్య కేంద్రాలు, పాఠశాలల్ని వారే నిర్వహించుకుంటారని ముఖ్యమంత్రికి, మంత్రులకు, ఎమ్మెల్యేలకు, అధికారులకు స్పష్టంగా తెలియచేయాలి. వార్డు మేనిఫెస్టోలతో, స్థానిక సాధికారతతో తమ సమస్యలను తామే పరిష్కరించుకునే అధికారాన్ని ప్రభుత్వం ఎందుకివ్వటంలేదో గట్టిగా ప్రశ్నించాలి. స్థానిక సాధికారత వల్ల కలిగే ప్రయోజనాల గురించి, వివిధ పథకాల పనితీరు గురించి ప్రజల్లో అవగాహన కలిగించాలన్నారు. త్వరలో జరగనున్న మున్సిపల్, పంచాయతీ ఎన్నికలలో 'వార్డు ప్రభుత్వాల' కోసం పార్టీలను డిమాండ్ చేసేలా ప్రజలను చైతన్యపరిచేందుకు ప్రజాపథాన్ని లోక్‌సత్తా శ్రేణులు ఒక అవకాశంగా వినియోగించుకోవాలి. ■

### పూచీకత్తు లేదనేది కుంటిసాకు మాత్రమే...

# ఎస్సీ, ఎస్టీల స్వావలంబనకై పారిశ్రామిక రుణాలు అందించాలి

**"అణగారిన వర్గాలకు అన్ని అవకాశాలూ ఉండేలా నూతన పారిశ్రామిక విధానాన్ని రూపొందించాలి" : లోక్‌సత్తా డిమాండ్**

సమాజంలో పలుకుబడి, రాజకీయ బంధుత్వం ఉన్నవారికి ఎటువంటి పూచీకత్తు లేకపోయినా వేలకోట్ల రూపాయల రుణాలను ఇస్తూ, వాళ్లు ఎగ్గొట్టినా మారుమాట్లాడని అర్థిక సంస్థలు, బ్యాంకులు... దళిత, గిరిజనులకు పారిశ్రామిక రుణాలు అందించటంలో మాత్రం పూర్తి ఉదాసీనంగా వ్యవహరిస్తూ అణగారినవర్గాలకు తీరని అన్యాయం చేస్తున్నాయి. మరోవైపు, ఎస్సీ,ఎస్టీల తరువున బ్యాంకులకు భరోసా ఇచ్చి రుణాలనందించాలనే బాధ్యతను రాష్ట్రప్రభుత్వం పూర్తిగా విస్మరించింది. ఎస్సీ,ఎస్టీలు స్వావలంబన సాధించి అవకాశాలు అందుకోవటానికి ఎప్పటికీ పోటీపడకూడదనే సంప్రదాయ పాలకుల కపట వైఖరికి రాష్ట్రంలో పారిశ్రామిక విధానం అమలు విస్పష్ట నిదర్శనం. "అణగారినవర్గాల విషయంలో పరస్పర విరుద్ధ వైఖరిని పాలకులు అనుసరిస్తున్నారు. వేలకోట్ల రూపాయలతో రెండు రూపాయలకు కిలోబియ్యం, పావలావడ్డీ వంటి తాత్కాలిక ఉపశమనాలిచ్చే పథకాలకు వేలకోట్ల రూపాయలను ఖర్చు పెడుతున్న ప్రభుత్వం... అణగారినవర్గాలకు స్వావలంబన చేకూర్చే పథకాల మీద మాత్రం దృష్టి పెట్టటం లేదు. పేదల్ని శాశ్వత పేదలుగా కొనసాగించాలన్నదే ఈ సంప్రదాయ పార్టీల నేతల విధానం. నిరంతరం ప్రభుత్వం ముందు వారు చేతులు చాచే బిచ్చగాళ్లుగా కొనసాగాలి తప్ప తలెత్తుకుని ప్రశ్నించేస్థాయికి ఎదగకూడదన్నదే వారి లక్ష్యం".

దాదాపు రూ.25,000కోట్ల మేర రుణాలిచ్చి 5,000 మంది ఎస్సీ, ఎస్టీలకు పారిశ్రామిక రుణాలనందిస్తామని హామీనిచ్చిన ప్రభుత్వం రాష్ట్రంలో గత ఐదేళ్లలో కేవలం రూ.100కోట్లలోపు రెండువందలమందికే రుణాలిప్పించగలగటం నేరసమాన నిర్లక్ష్యం సమాజంలో సంపన్నుల కంటే అణగారినస్థాయి నుంచి ఎదుగుతున్నవారే రుణ వాయిదాల్ని సక్రమంగా చెల్లిస్తారు. పూచీకత్తు లేదనే సాకుతో రుణాలు ఆపటం ఏమాత్రం సహేతుకం కాదు. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే కొన్ని ప్రమాణాలతో తానే పూచీకత్తు అందించవచ్చు. ఎస్సీ, ఎస్టీలు పారిశ్రామికంగా ఎదిగేందుకు అనేక ప్రత్యామ్నాయ అవకాశాల్ని కల్పించవచ్చు. ఇందుకు మధ్యప్రదేశ్ ప్రభుత్వం అమలుచేస్తున్న విధానమే సాక్ష్యం. పరిశ్రమలలో రూ.5లక్షల లోపు పనులన్నీ ఎస్సీ,ఎస్టీలకే కేటాయించాలనే నిబంధనను అక్కడి సర్కారు అమలుచేస్తోంది. మన ప్రభుత్వం కనీసం సమస్యను పరిష్కరించే ప్రత్యామ్నాయ విధానాలవైపే దృష్టి సారించలేదు.

రిజర్వేషన్ల పేరుతో అణగారిన కులాల మధ్య చిచ్చుపెట్టటం, స్వావలంబన లేకుండా కేవలం తాత్కాలిక ఉపశమనమిచ్చే పథకాలతో మభ్యపెట్టే ధోరణికి ఇకనైనా స్వస్తిచెప్పాలి. ఎస్సీ, ఎస్టీలకు ఉపాధినైపుణ్యాలను పెంపొందించటంతోపాటు వారు పారిశ్రామిక రంగంలో ఎదిగేందుకు పూర్తిస్థాయిలో రుణసౌకర్యం అందించేలా, ఉన్న అవకాశాల గురించి వారిలో చైతన్యం పెంచే ప్రచార కార్యక్రమం ఉండేలా నూతన పారిశ్రామిక విధానాన్ని (2010-2015) రూపొందించాలి. ■









# ఐఐఐటీల సీట్ల తగ్గింపు తుగ్లక్ చర్య

– లోక్‌సత్తా



**రాజకీయ, పాలనావ్యవస్థల్లో అవినీతి విశృంఖలంగా సాగుతోంది. దుబారాను, పథకాల్లో అక్రమాలను అరికట్టే చర్యలు తీసుకుని డబ్బు ఆదా చేసే ప్రయత్నం చేయకుండా గ్రామీణ ప్రాంతాల్లో సంపద పెంపునకు ఉపయోగపడే ఐఐఐటీల సీట్లకు కత్తెర వేయటం ఏ విధంగానూ సమర్థనీయం కాదు" విద్య, ఆరోగ్యం, ఉపాధి నైపుణ్యాల పెంపు కోసం ఎంతైనా వెనకడుగు వేయకుండా ఖర్చు చేయాలి. సర్వశక్తులతో కృషిచేయాలి.**

ఆర్థికభారం పేరుతో ఏపీ ఐఐఐటీ సీట్లను 2010–11కు సగానికిసగం తగ్గించటం ఏనుగులు దూరే ద్వారాలను వదిలేసి ఎలకలు దూరే సందుల్ని పట్టుకున్న సామెతను గుర్తుచేస్తోంది. ఆ నిర్ణయం అతితెలివితో తీసుకున్న ప్రజా వ్యతిరేక చర్య. అనవసర రంగాల్లో వ్యయాన్ని నియంత్రించి అవసరమైన రంగాల్లో ప్రతి పైసానూ సద్వినియోగం చేస్తూ ప్రభుత్వం ఆర్థిక పొదుపును పాటించాలి. అయితే మన రాష్ట్రపాలకులు మాత్రం అందుకు పూర్తి విరుద్ధంగా వ్యవహరిస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో విద్యార్థులకు అత్యాధునిక వృత్తినైపుణ్యాలను అందించి వారి ఎదుగుదలకు దోహదం చేసే ఐఐఐటీ సీట్లను 6,000 నుంచి 3,000వరకూ తగ్గించటం అలాంటి తుగ్లక్ తరహా నిర్ణయమే. ఆ సీట్లను కొనసాగించటం వల్ల విద్యార్థుల మీద ఏడాదికి రూ. 24కోట్లు మాత్రమే వ్యయమవుతుంది. మౌలికవసతుల్ని కూడా పరిమిత ఖర్చుతోనే ఏర్పరుచుకోవచ్చు. అయితే ప్రాథమ్యాల పట్ల అవగాహన, చిత్తశుద్ధి లేకపోవటం వల్ల ఏకంగా సీట్లను తొలగించటం ప్రభుత్వ ఘోర తప్పిదం.

"అర్థంలేని అనేక పథకాలకు ప్రభుత్వం వేలకోట్లు వెచ్చిస్తోంది. జలయజ్ఞం పేరుతో ప్రణాళిక లేని, నీళ్లు లేని ప్రాజెక్టులను సైతం నిర్మిస్తున్నారు. మరోవైపు, రాజకీయ, పాలనావ్యవస్థల్లో అవినీతి విశృంఖలంగా సాగుతోంది. దుబారాను, పథకాల్లో అక్రమాలను అరికట్టే చర్యలు తీసుకుని డబ్బు ఆదా చేసే ప్రయత్నం చేయకుండా గ్రామీణ ప్రాంతాల్లో సంపద పెంపునకు ఉపయోగపడే ఐఐఐటీల సీట్లకు కత్తెర వేయటం ఏ విధంగానూ సమర్థనీయం కాదు" విద్య, ఆరోగ్యం, ఉపాధి నైపుణ్యాల పెంపు కోసం ఎంతైనా వెనకడుగు వేయకుండా ఖర్చు చేయాలి. సర్వశక్తులతో కృషిచేయాలి. విద్యారంగంలో చేసే ఖర్చుకు రూ. 1 కూడా కోత పడకూడదు.

## వైద్యకళాశాలల కేటాయింపులో ఇంకా భయంకర అవినీతి ఉంది

## సి.ఎ తరహాలో ప్రతిభ పరీక్ష ఆధారంగా డిగ్రీ ఇవ్వాలి

మన పొరుగున ఉన్న చైనా వందలసంఖ్యలో విశ్వవిద్యాలయాలను ఏర్పాటుచేసి విద్యను వ్యాప్తి చేసేందుకు యుద్ధప్రాతిపదికన కృషి చేస్తుంటే, మనదేశంలో మాత్రం ఉన్న సీట్లు తగ్గించటం, అవినీతికి పాల్పడటం చేస్తున్నారు. భారత వైద్య విధానమండలి ఛైర్మన్ కేతన్ దేశాయ్ రూ. 2కోట్లు లంచం తీసుకుంటూ సీబీఐకి చిక్కిన ఉదంతం ఇందుకు ఉదాహరణ వైద్యకళాశాలల కేటాయింపులో రూ. 4.5 నుంచి 6కోట్ల వరకూ చేతులు మారుతున్నాయని ప్రధానమంత్రి దృష్టికి కూడా తీసుకెళ్లడం జరిగింది. ఎమ్మెల్యే నుంచి ప్రధాని వరకూ, విద్యావేత్తలందరికీ ఈ లంచాల వ్యవహారం బహిరంగ రహస్యం. ఈవేళ సీబీఐ దాడుల్లో బైటపడింది కేవలం ఓ చిన్నతునకే, ఐస్‌బెర్గ్ కింద నీరులా భారీస్థాయి అవినీతి ఇందులో దాగివుంది. విద్యావ్యవస్థలో లంచాలు తీసుకోవటానికి వీలుగా రిజిస్ట్రేషన్లు వగైరా నిబంధనల్ని ప్రవేశపెట్టి అటు ప్రజాధనాన్ని, ఇటు యువత భవిష్యత్తును చేతులారా నాశనం చేస్తున్నారు. వైద్యరంగంలో వేలకోట్లు చేతులు మారుతున్నాయి. అయితే నాణ్యమైన వైద్యులు మాత్రం తయారవటంలేదు. ఈ పరిస్థితిని మార్చేందుకు సమూల ప్రక్షాళన చేయాలి. కళాశాల చదువునే ప్రమాణంగా చేయకుండా, చదువు పూర్తయ్యాక చార్టెడ్ అకౌంటెన్సీ తరహాలో ప్రతిభను నిర్ధారించే పరీక్ష ఆధారంగా డిగ్రీ ఇచ్చే విధానం తేవాలి. దీనివల్ల దోపిడీకి అవకాశం ఉండదు. నాణ్యమైన వృత్తినిపుణులు సమాజానికి లభిస్తారు. ■




# ప్రజల్లో చైతన్యం పెంచేందుకు శక్తిని వినియోగిద్దాం

## రాజధాని అసెంబ్లీ ఇంఛార్జులు, నేతల సమావేశంలో జేపీ

లోక్‌సత్తా ప్రస్తుతం ఎదుర్కొంటున్న సమస్య అంతర్గతమైనదికాదు, చాలామేరకు బాహ్యమైనది, వ్యవస్థలో మార్పు రావాలని సమాజంలో ఆకాంక్ష ఉన్నప్పటికీ తపన లేకపోవటం వల్ల పార్టీ రాజకీయంగా ఆశించిన విజయాల్ని సాధించలేకపోతోంది. వ్యవస్థను మార్చాలంటే తాము బాధ్యత తీసుకోవాలని ప్రజలు ఇంకా అనుకోవటం లేదు. ఏదోక మంత్రం ద్వారా తెల్లారేసరికల్లా సమాజాన్ని ఎవరో మారుస్తారనే భ్రమలో ఉన్నారు. ప్రజలకు ఈ వాస్తవం అర్థమయ్యేంతవరకూ నిరుత్సాహానికి గురికాకుండా కృషిని కొనసాగించాల్సుంది, ఈరోజు కాకపోతే రేపైనా సమాజాన్ని మార్చటానికి లోక్‌సత్తా విధానాలు తప్ప వేరే మార్గంలేదు. లోక్‌సత్తా ఎప్పుడూ పరిష్కారంలో భాగం. పార్టీ కార్యకర్తలెవరూ తాత్కాలిక ప్రయోజనాల కోసం ఆత్మగౌరవాన్ని తాకట్టు పెట్టాల్సిన పన్లేదు.

24 ఏప్రిల్ న పార్టీ ప్రధాన కార్యాలయంలో జరిగిన గ్రేటర్ హైదరాబాద్ అసెంబ్లీ నియోజకవర్గాల ఇంఛార్జులు, డివిజన్ అధ్యక్షులు, 2009 ఎన్నికల పార్టీ అభ్యర్థుల సమీక్షా సమావేశంలో జేపీ మాట్లాడుతూ దిశానిర్దేశం చేశారు. కాంట్రాక్టులు, ఇతర ఆర్థికలాభాలు లేకుండా ప్రజల జీవితాల్ని ఎలా మార్చాలి అనే ఎజెండా మీద చర్చించటానికి ప్రధాన పార్టీలుగా చెప్పుకుంటున్న వారి కార్యాలయాల్లో సమావేశానికి ఇంత పెద్దఎత్తున నేతలు హాజరుకారని తాను నిర్ద్వంద్వంగా చెప్పగలనని జేపీ హాజరైనవారిని అభినందిస్తూ అన్నారు. ఎ.బి ప్రతాప్‌రెడ్డి సమావేశానికి సమన్వయకర్తగా వ్యవహరించారు.

పౌరసత్వం, పౌరబాధ్యత సున్నాగా ఉన్న ఈ సమాజం వల్ల సంప్రదాయ రాజకీయపార్టీలు కూడా తీవ్ర ఒత్తిడికి గురవుతుంటాయి, అయితే వారు సమాజాన్ని మార్చేందుకు ప్రయత్నించకుండా మభ్యపెట్టి ఫలితాలు సాధించేందుకు ప్రయత్నిస్తున్నారు. లోక్‌సత్తా మాత్రం అడ్డదారుల్లో వెళ్లకుండా సమాజాన్ని మార్చి జనం చేతికి అధికారం ఇచ్చేందుకు వివిధ మార్గాల్లో పోరాడుతోంది. "దేశంలో ఏ మార్పు అయినా జనం ద్వారా తప్ప సాధ్యం కాదు. మనం చేయగలిగిందల్లా సరైన వేదికను నిర్మించటం. ఎన్నికలు తమ జీవితాలకు సంబంధించినవి అనుకోకుండా ఎవరినో గెలిపించేందుకు వ్యూహాత్మకంగా ప్రజలు ఓటు వేస్తున్న ప్రస్తుత తరుణంలో మనం ఎన్నికల ఫలితాల ప్రభావానికి లోనుగాకుండా జాతికి అవసరమైన సేవల్ని వేర్వేరు రూపాల్లో అందించేందుకు కృషి చేయాలి. సమాజంలో చైతన్యం పెంచాలి. రాజకీయాన్ని మార్చాలి. అది పూర్తిగా మన చేతిలో ఉంది'' కలిసి పనిచేస్తూ మనకున్న శక్తిసామర్థ్యాల్ని సద్వినియోగమయ్యేలా జాగ్రత్తగా వినియోగించుకోవాలి.

హైదరాబాద్‌కు వచ్చే నాలుగేళ్లూ ఎన్నికలు కూడా లేవుకాబట్టి, నగర నిర్మాణానికి, జాతి నిర్మాణానికి మనవంతు చేయగలిగిన కర్తవ్యాల్ని చేయాలి, లోక్‌సత్తా రూపొందించిన వార్డు మేనిఫెస్టోలను వార్డు కమిటీల ద్వారా నెరవేర్చేందుకు ప్రయత్నించాలి. ■

# ఆన్సర్ షీట్స్ పొందడం మన హక్కు



**2008** వ సంవత్సరం రాష్ట్రస్థాయి పోలీస్‌రిక్రూట్‌మెంట్ బోర్డ్ (SLPRB) నిర్వహించిన S.I పరీక్షను వై. నరేష్ వ్రాసాడు. 2009 సంవత్సర ఫలితాలు వెల్లడించారు. 14 మార్చి 2009న అతను సంబంధిత పబ్లిక్ ఇన్‌ఫర్మేషన్ ఆఫీసర్‌కు తన పేపర్ III పేపర్ IV లకు సంబంధించిన OMR షీట్స్ మరియు పేపర్ III పేపర్ IV లకు సంబంధిత ఆన్సర్‌కీస్‌ల జిరాక్స్‌కాపీలు కావాలని RTI అప్లికేషన్ పెట్టాడు.

PIO తన సమాధానంలో OMR "కాన్ఫిడెన్షియల్ కావడం వల్ల ఇవ్వడం కుదరదని వ్రాసారు. నరేష్" "అప్పీలేట్ అథారిటీ" కి 6 ఏప్రిల్ 2009న అప్పీల్ చేసాడు. ఆయనా అదే సమాధానం ఇచ్చారు.

19 మే 2009న AP ఇన్‌ఫర్మేషన్ కమీషన్‌కి రెండవ అప్పీల్ చేసాడు. రెండవ అప్పీల్ కేసు No. 4434/ CIC 2009 ద్వారా హియరింగ్‌కు వచ్చింది. స్టేట్ ఛీఫ్ ఇన్‌షర్మేషన్ కమీషనర్ శ్రీ సి.డి. అర్హా ఛాంబర్‌లో 23 ఏప్రిల్ 2010న కేసు విచారించబడినది.

SLPRB రిప్రజెంటేషనర్‌గా శ్రీ సత్యనారాయణ్ IPS ఇన్స్‌స్పెక్టర్ జనరల్ మరియు SLPRB PIO వచ్చారు. నరేష్ రిప్రజెటేటివ్‌గా శ్రీ గంజి శ్రీనివాసరావు, ఇంఛార్జి, CHC సరూర్‌నగర్ మరియు శ్రీ పి. సునంద్ హాజరయ్యారు.

వాదోపవాదాలు క్లుప్తంగా విషయానుగతంగా జరిగాయి. శ్రీ సత్యనారాయణ OMR షీట్స్ ఇవ్వడం వల్ల ఇక నుండి చాలామంది అభ్యర్ధులు కావాలని అడుగుతారని, రోజువారి కార్యనిర్వహణ క్లిష్టం అవుతుందని పేర్కొన్నారు. శ్రీ అర్హా ఈ వాదనను త్రోసిపుచ్చారు. తాను ఈ మధ్యనే NTR హెల్త్ యూనివర్శిటీని ఆన్సర్ షీట్స్ డా॥ ఎల్ శ్రీనివాస్‌కి ఇవ్వమని ఉత్తర్వులు ఇచ్చామని (Appeal No. 4192/CIC2009, Dt. 02.02.2010) అలాగే సెంట్రల్ ఇన్‌ఫర్మేషన్ కమీషన్ శ్రీ వజాహత్ హబీబుల్లా (cic.gov.in / cic.oden/wb04032009-04..... ఇచ్చిన ఉత్తర్వుల్లో RTI చట్టం ప్రకారం OMR షీట్స్, దిద్దిన సమాధాన పత్రాలు దరఖాస్తుదారుకి ఇవ్వాలని పేర్కొన్నామని చెప్పారు.

గౌరవనీయ ఢిల్లీ హైకోర్టు వారు కూడా ఇటువంటి అప్పీల్ విషయంలోనే సమాధాన పత్రాలు RTI చట్టం నుండి మినహాయింపు కాదని, ఈ చట్టం ప్రకారం అధికారులు నిరాకరించాలేరని చెపుతూ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఛార్టర్డ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా వారు సర్టిఫైడ్ కాపీని అర్జీదారుకు అందజేయాలని ఉత్తర్వులు జారీచేసారు. RTI చట్టం ఈ విషయంలో చాలా స్పష్టంగా వుందని, ఇటువంటి విషయాలలో ఇంకేమాత్రం ఆలస్యం పనికిరాదని తెలిపారు. ఆయన SLPRB PIO శ్రీ సత్యానారాయణను నరేష్‌కు OMR షీట్స్ మరియు సమాధాన పత్రాల ఫొటోకాపీలు ఇవ్వవలసిందిగా ఉత్వర్వులు జారీ చేసారు.

ఈ తీర్పు పరీక్షల మూల్యాంకన విధానంలో పూర్తి పారదర్శకత, జవాబుదారీతనాన్ని పెంపొందించి సరైన న్యాయాన్ని అందిస్తుంది. ఈ తీర్పు మరియు సెంట్రల్ ఇన్‌షర్మేషన్ కమీషనర్ తీర్పు ఏ యూనివర్శిటీ అయినా లేక ప్రభుత్వ సంస్థ అయినా నిర్వహించే అన్ని పరీక్షలకు వర్తిస్తుంది.

దీనివల్ల పరీక్షలు వ్రాసే లక్షలాది అభ్యర్ధులు విశ్వసనీయతతో తమ సమాధాన పత్రాలు దిద్దబడతాయని నమ్మవచ్చు. ఏదైనా తప్పు జరిగితే దాన్ని సరిదిద్దుంచుకోగల అవకాశం కూడా లభిస్తుంది.

ఇది పూర్తి పారదర్శకతకు, జవాబుదారీతనానికి గెలుపు. ■

**(గంజి శ్రీనివాసరావు)**

# నిధులన్నీ ఎక్కడికి పోతున్నట్లు ?

బాలానగర్ పి. హెచ్.సి.లో తీరని సమస్య

**తేది:** 20-4-2010 సమయం : 9-30 ని॥ ల నుండి 12-00 గం॥

**పని :** బాలానగర్ PHC ని సందర్శించి సమస్యలను గుర్తించి డా॥ జేపీకి నివేదించడం

**పాల్గొన్న సభ్యులు :** నాగేంద్రబాబు, ఉపేందర్ రెడ్డి, సాంబిరెడ్డి, విజయభాస్కర్ రెడ్డి, కృష్ణారెడ్డి, ఆంజనేయులు

ఈ PHC కేంద్ర జనాభా - 3, 40,000

ఈ PHC కేంద్ర ఉపకేంద్రాలు - 13 (సాధారణంగా 6 మాత్రమే వుంటాయి)

మొత్తం పనిచేస్తున్న స్టాఫ్ - 22 (+16 ఆశ వలంటీర్లు) ఒక ప్రైవేటు హాస్టల్‌కు వుండే వసతులు ఉచిత మందులు, ఆపరేషన్ సౌకర్యాలు, ఫ్యామిలీ ప్లానింగ్ సౌకర్యాలు, అన్ని వాక్సినేషన్ సౌకర్యాలు దీనికి వున్నాయి.

**గుర్తించిన సమస్యలు :**

1. రోగులు చాలా తక్కువ మంది వస్తున్నారు. 2. ఆస్పత్రికి రవాణాసౌకర్యం లేదు. 3. గత నాలుగు నెలలుగా 16 ANM లకు జీతాలు అందడం లేదు. 4. చాలా తక్కువ స్థలంలో ఇరుకిరుకుగా ఆస్పత్రి వుంది. 5. ఉపకేంద్రాలకు నెలకు రూ. 250 మాత్రమే అద్దె ఇస్తున్నారు. 6. 16 ఆశ వలంటీర్లు మాత్రమే వున్నారు. NRHM ప్రమాణాల ప్రకారం ప్రతి 1000 జనాభాకి ఒక ఆశ వలంటీర్ వుండాలి. 7. ఆస్పత్రి నిర్వహణకు, శుచిశుభ్రతల కోసం నిధులు లేవు. కాని NRHM ప్రకారం గ్రామీణ ప్రాంతాలలోనే ప్రతి PHC కి సంవత్సరానికి రూ॥ 90,000/- రోగికి కళ్యాణ సమితి స్కీము ప్రకారం ప్రతి PHC కి సంవత్సరానికి రూ. 1,00,000/- మరియు ఉపకేంద్రానికి సంవత్సరానికి 10,000 వస్తాయి. **ఈ నిధులన్నీ ఎక్కడికి పోతున్నట్లు?** ■

## రాష్ట్రంలో నిత్యం జరిగే అవినీతి అక్రమాలను నిరోధించడానికి, నివారించడానికి ప్రణాళిక

**“నిబంధనల్లో మినహాయింపులే అవినీతికి ప్రధాన కారణం. నిబంధనలను ఇష్టారాజ్యంగా మినహాయిస్తుండడం వల్ల అవినీతికి ఆస్కారమేర్పడుతుంది” హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ గణపత్‌సింగ్ సింఘ్వి, న్యాయమూర్తి గ్రంథి భవానీ ప్రసాద్‌లతో కూడిన ధర్మాసనం వ్యాఖ్యానం.**

- రాష్ట్రంలోని అవినీతి అక్రమాలకు చరమగీతం పాడాలంటే కింది వాటిని తు.చ తప్పకుండా నిరంతరం అమలు జరిగేలా ప్రతి ఒక్కరూ (లోక్‌సత్తా పార్టీ నాయకులు, అభిమానులు, స్వచ్ఛంద సంస్థలు, కార్యకర్తలు) నిఘా పెట్టడం ద్వారా వ్యవస్థలో మంచి మార్పులు వస్తాయి.
- రాష్ట్రంలోని సుమారు 11 లక్షల మంది కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వోద్యోగులు, అధికారులు జాబ్‌చార్ట్, సిటిజన్ చార్ట్ ప్రకారం విధులు నిర్వహించేలా చేయడం
- డిస్ట్రిక్ట్ ఆఫీస్ మాన్యువల్ ప్రకారం ప్రతి ఉద్యోగి, అధికారి సమయపాలన ఆచరించేలా చేయటం
- జీవోఎంఎస్ నం. 20, ఫైనాన్స్ అండ్ ప్లానింగ్ (ఎఫ్‌డబ్ల్యు:టిఎ) డిపార్ట్‌మెంట్, తేది 08.02.2001 ప్రకారం ప్రతి ఉద్యోగి, అధికారి హెడ్ క్వార్టర్‌లో స్థానికంగా నివాసం ఉండేలా చూడటం.
- సివిల్ సర్వీసుల (ప్రవర్తన) నియమావళి 1964, నియమం 9 మరియు జీ.వో.ఎంఎస్.నం. 468, ప్రధాన పరిపాలన (సర్వీసులు) శాఖ, తేది 17.04.1964, జీ.వో.ఎంఎస్. నం 52, ప్రధాన పరిపాలన (సర్వీసులు) శాఖ, తేది 04.02.1988, జీ.వో.ఎంఎస్.నం.224, ప్రధాన పరిపాలన (సర్వీసులు) శాఖ తేది 28.04.1989 మరియు జీ.వో.ఎంఎస్.నం. 471, ప్రధాన పరిపాలన (సర్వీసులు) శాఖ, తేది 17.09.1994 ప్రకారం ప్రతి ఉద్యోగి, అధికారి యొక్క స్థిర చరాస్తుల నివేదికలు వెబ్‌సైట్‌లో ఉంచేలా చర్యలు చేపట్టడం ద్వారా రాష్ట్రంలో ప్రభుత్వోద్యోగుల అవినీతిని, సంప్రదాయ రాజకీయ పార్టీలు, అధికార, ప్రతిపక్ష ప్రజాప్రతినిధుల (SARPANCHs, MPTs, ZPTs, MLAs, MPs, MINISTERs) అక్రమాలను నిరోధించవచ్చు, నివారించవచ్చు....

**- గంజి శ్రీనివాసరావు**

(వీటిని గత నాలుగు సంవత్సరాలుగా స్వయంగా ప్రయోగం చేసి సాధించిన విజయాలు, వచ్చిన ఫలితాల ఆధారంగా చెబుతున్నాను.) ■

# చట్టవిరుద్ధమైన వ్యాపారం అవినీతికి ఆలవాలం

యుద్ధం మళ్ళీ ప్రకటించాం... అది జరుగుతూనే వుంటుంది... ఆకాశంలో మువ్వన్నెల పతాకం గర్వంగా రెవరెవలాడేలా అభివృద్ధి చెందిన భారతదేశాన్ని చూసేవరకూ.....దానిలో లేశమాత్రం అవినీతి, అన్యాయాలు వుండకూడదు.

అవును చట్టవిరుద్ధమైన వ్యాపారానికి, అవినీతికి వ్యతిరేకంగా పోట్లాడాము. వేలకొద్దీ ప్రయాణీకులు తమ గమ్యస్థానాలకు వెళ్ళేందుకై వచ్చే హైదరాబాదు మహాత్మాగాంధీ బస్‌స్టేషన్‌కి మేము ఈ వారాంతంలో వెళ్ళాము. ఈ కార్యక్రమం మన ప్రస్థానంలో మరో ముందడుగు అవుతుందని ఆశిస్తూ.....

**కార్యక్రమం :** మహాత్మాగాంధీ బస్‌స్టేషన్ లోని దుకాణ సముదాయాల రిజిస్ట్రేషన్ మరియు రెన్యూవల్‌ని లేబర్ అధికారుల సమన్వయంతో పర్యవేక్షించడం.

**తేది :** 1 మే, 2010

పాల్గొన్న కార్యాలయాలు : ఎ.పి.ఎస్.ఆర్.టి.సి. మరియు లేబర్ డిపార్ట్‌మెంట్.

**లక్ష్యం :** 1.బస్‌స్టాండ్‌లోని అన్ని దుకాణ సముదాయాలు లేబర్ డిపార్ట్‌మెంట్‌తో ప్రతీ సంవత్సరం రిజిస్ట్రేషన్ మరియు రెన్యూవల్ చేయించుకోవడం.

2. ఆంధ్రప్రదేశ్ షాప్స్ ఎస్టాబ్లిష్‌మెంట్స్ యాక్ట్ 1988 ప్రకారం ఉద్యోగస్థులందరికీ కల్పించవలసిన సౌకర్యాలు అందేలా చూడటం.

దీని వల్ల ప్రభుత్వానికి ఆదాయం పెంచవచ్చు. మరియు ఉద్యోగుల సంక్షేమం, హక్కులు పరిరక్షించవచ్చు.

**వాడిన సెక్షన్స్, వివరాలు**

- ఆర్.టి.ఐ. యాక్ట్ 2005, సెక్షన్ 6(ఐ) ప్రకారం ప్రతి వ్యక్తిని ఏ ప్రభుత్వ విభాగం నుండైనా సమాచారం కోరవచ్చు.
- అర్.టి.ఐ యాక్ట్ 2005, సెక్షన్ 2(1) (2) ప్రకారం ప్రతివ్యక్తి తనకు కావలసిన సమాచారానికి సంబంధించిన నకలు కాపీని పొందవచ్చు.
- ఎ.పి.షాప్స్ & ఎస్టాబ్లిస్‌మెంట్ యాక్ట్, సెక్షన్ 17 ప్రకారం ప్రతీ దుకాణాదారుడు లేబర్ డిపార్ట్‌మెంట్‌తో రిజిష్టర్ అయ్యి, ఉద్యోగులకు నిర్దిష్ట వసతులు కల్పించాలి.

లేబర్ డిపార్ట్ మెంట్ గురించి మరింత సమాచారం కొరకు http://labour.ap.gov.in చూడవచ్చు.

**విధానము**

ఎవరైనా తన నగరం, పట్టణం, మండలంలో ఈ కార్యక్రమాన్ని చేపట్టాలంటే

1. ఎ.పి.ఎస్.ఆర్.టి.సి.కి ఆర్.టి.ఐ. పిటీషన్‌లో సంబంధిత బస్ స్టేషన్‌లోని దుకాణాల (పేరు, నెలవారి లైసెన్సులు వగైరా) గురించి సమాచారాన్ని కోరండి.
2. లేబర్ డిపార్ట్‌మెంట్‌లో రిజిస్ట్రేషన్ అయిన దుకాణాల సమాచారాన్ని కోరుతూ లేబర్ డిపార్ట్‌మెంట్‌కి ఎ.పి. షాప్స్ & ఎస్టాబ్లిస్‌మెంట్ చట్టం ప్రకారం ఆర్.టి.ఐ. అప్లికేషన్ పెట్టాలి.
3. వచ్చిన సమాచారంతో బస్‌స్టాండ్‌లోవున్న దుకాణ సముదాయాల వివరాలను పోల్చిచూడండి.
4. లేబర్ డిపార్ట్‌మెంట్‌కి ఫిర్యాదు చేయండి.
5. పై ఫిర్యాదుకి సంబంధించి లేబర్ డిపార్ట్‌మెంట్‌లో ఆర్.టి.ఐ. అప్లికేషన్ పెట్టండి

**మరిన్ని వివరాలకు**

6. షాపు యజమానులు కడుతున్న కమర్షియల్ టాక్సెస్ వివరాలకోసం కమర్షియల్ టాక్స్ డిపార్ట్‌మెంట్‌లో ఆర్.టి.ఐ. అప్లయ్ చేయండి.
7. లైసెన్సు ఫీజు వివరాలను స్టెప్1ని స్టెప్ 6తో పోల్చిచూడండి.
8. ఏమైనా అనుమానాస్పదంగా వుంటే కమర్షియల్ టాక్స్ డిపార్ట్‌మెంట్‌కు ఆర్.టి.ఐ. అప్లికేషన్ పెట్టండి.

**చేపట్టిన కార్యక్రమాలు**

1. రెండు డిపార్ట్‌మెంట్స్‌లోను ఆర్.టి.ఐ.వేసి కావల్సిన సమాచారాన్ని సేకరించాము. నమ్మశక్యంకాని నిజమేమిటంటే మహాత్మాగాంధీ బస్‌స్టేషన్ హైదరాబాద్‌లోని 104 దుకాణాల్లో 2 మాత్రమే లేబర్‌డిపార్ట్‌మెంట్‌తో రిజిస్టర్ అయినాయి.
2. లేబర్‌డిపార్ట్‌మెంట్‌కు ఫిర్యాదు మరియు తదుపరి ఆర్.టి.ఐ. అప్లికేషన్ పెట్టాము.
3. లేబర్ పార్లమెంట్ వారు దుకాణాల రిజిస్ట్రేషన్ తనిఖీలో మమ్మల్ని పాలు పంచుకోవలసిందిగా కోరారు.
4. వేం ఒక బృందంగా ఈ కార్యక్రమంలో పాల్గొని పర్యవేక్షించాము.

దీని పర్యవసానంగా ఒకే రోజు 24 దుకాణాలు రిజిస్ట్రేషన్ చేయించుకోవడం జరిగింది. వారంలోగా అన్ని దుకాణాల రిజిస్ట్రేషన్ పూర్తవుతుందని భావిస్తున్నాము.

**ప్రయోజనాలు :**

- అన్ని దుకాణాలు ప్రతీ సంవత్సరం రిజిస్ట్రేషన్, రెన్యూవల్ చేయడం ద్వారా ప్రభుత్వానికి ఆదాయం పెరుగుతుంది.
- ఉద్యోగస్తులకు యజమానులు అందించవలసిన సౌకర్యాలు కలుగుతాయి.
- ఉద్యోగస్తులకు చేరేటప్పుడు నియామకపత్రం ఇవ్వాలి.
- సరైన కారణంలేకుండా ఉద్యోగంలోంచి తీసివేయరాదు.
- పని గంటలు రోజుకు 8 గంటలు మరియు వారానికి 48 గంటలు మాత్రమే వుండాలి.
- ప్రతీ ఉద్యోగికి వారానికి కనీసం ఒక సెలవురోజు వుండాలి.
- అందరు ఉద్యోగులకు కనీసం 9 జాతీయ సెలవులు వుండాలి.
- సాధారణ సెలవు అందరు ఉద్యోగస్తులకు అందుబాటులో వుండాలి.
- సెలవుల్లో పని చేసే ఉద్యోగస్తులు ఎక్కువ జీతం పొందాలి. రిజిష్టర్డ్ దుకాణాలు / కంపెనీల్లో పనిచేసే ఉద్యోగస్తులు ప్రభుత్వం నుండి కూడా కొన్ని సదుపాయాలు పొందుతారు. (ఉదాహరణకి పిల్లల పెళ్ళిళ్ళకి డబ్బు, పిల్లల చదువుకు స్కాలర్‌షిప్స్) చాల మందికి తెలియని ఎన్నో లాభాలు ఉద్యోగస్తులకి ఉన్నాయి.
- పై రూల్స్ పాటించని చట్టవిరుద్ధ దుకాణ/ కంపెనీ యజమానులని పట్టుకోవడం.
- సంస్థలు మరింత క్రమశిక్షణతో వుంటాయి. బాధ్యత గల పౌరుల పర్యవేక్షణతో ప్రభుత్వ కార్యాలయాలు మరింత జాగరూకతతో వ్యవహరిస్తాయి.
- ఒక్కమాటలో "మరింత క్రమశిక్షణగా, పారదర్శకంగా అవినీతి లేని సమాజం" ఏర్పడుతుంది.

**పాల్గొన్న బృంద సభ్యులు :** గంజిశ్రీనివాసరావు, దేవిప్రసాద్, ప్రదీప్, ఉదయ్‌భాస్కర్, అబ్దుల్ ఆజీజ్ మరియు రాఘవేంద్ర.

సంబంధిత ఫోటోలు : http://picasaweb.google.com//loksattasanjeevani/01May2010Monitoring The RegistrationAtMGBS#

మనందరము కలలుగంటున్న మన సమాజాన్ని మరింత మెరుగు పరిచేందుకు ఈ కార్యక్రమాల్లో మీరు మాతో ప్రతీక్షణమూ, ప్రతీరోజు కలిసి వస్తారని ఆశిస్తూ.... ■

**– గంజిశ్రీనివాసరావు**

## ఉచిత విద్య – ప్రభుత్వం బాధ్యతా ! ప్రజల బాధ్యతా?

**- మానస చామర్తి**

చచ్చిపోతున్న ఆశలను చిగురింపజేస్తానంటూ ఒక చట్టం వస్తోంది సంజీవనిలా
ఉచిత విద్య ఇకపై బాలలందరి హక్కని వాదిస్తూ ఇస్తోందేదో భరోసా!
విజ్ఞాన జ్యోతులతో వెలుగులు విరజిమ్మే విద్యాభారతికి అవ్వాలిదే పునాది
పైసా ఖర్చులేని చదువులే కావాలి పేదింటి పసివాళ్ళ పాలిటి పెన్నిధి!



ఈ చట్టం కూడా అమలు కాని మరో చెత్త కాగితం కాకముందే,
భారతదేశపు బంగారు భవిష్యత్తు కోసం కేటాయించిన నిధులు
మరోసారి అవినీతిపరుల వలలో పడి విలువ కోల్పోకమునుపే
ఛేధిద్దాం ఈ నిద్రాణ జాతిని బంధిస్తున్న నిస్తేజపు శృంఖలాలు

కలల్లోని నవ భారతాన్ని కళ్ళారా చేసేందుకు, గర్వించేందుకు...
మన స్వప్నం నిజమవుతుందని విశ్వసించేందుకు, నిరూపించేందుకు
ప్రభుత్వాలు – చట్టాలూ, నాయకులు, వాళ్ళ వెర్రి వాగ్దానాలూ కాదు
నిస్వార్థమైన ఆవేశంతో పోటెత్తే ప్రజా ప్రభంజనమే కావాలి... ఈ జాతిని గెలిపించాలి!!

**జైహింద్...!!**

# మహిళాసత్తా



ఏప్రిల్ 29వ తేదిన శ్రీదేవి, భవానీలతో కలిసి వారి ద్వారా 120,121,123 డివిజన్‌లలోని డ్వాక్రామహిళలను సమావేశపరచటమైనది. అదే సమయంలో వారి వారి డివిజన్ కమిటీలను వేయటం జరిగింది. ముఖ్యంగా ఉపాధి అవకాశాలను హెల్ప్ సంస్థలోని వారికి తెలియజేయటం జరిగింది. ష్నైడర్ ఎలక్ట్రికల్ ఫాక్టరీలోని ఉపాధి అవకాశాలను వారికి వివరించటం జరిగింది. ఈ కార్యక్రమానికి మహిళాసత్తా అధ్యక్షురాలు ఎన్. సరోజాదేవి, ఉపాధ్యక్షురాలు మహాలక్ష్మి, ఎగ్జిక్యూటివ్ మెంబర్ వై. రమణి, లలితసుధ పాల్గొన్నారు. బాల్‌నగర్‌కు చెందిన తాతారావు, అరుణ్ కూడా ఈ సమావేశంలో ఉన్నారు.




## ప్రతి మహిళ స్వయం శక్తితో ఎదగాలి

**ప్రకాశం జిల్లా, ఒంగోలు :** శ్రీశ్రీ జయంతిని పురస్కరించుకొని స్థానిక రాంనగర్‌లోని ఆంధ్రప్రదేశ్ మహిళాభ్యుదయ సమితి కార్యాలయంలో ఏర్పాటు చేసిన సభలో లోక్‌సత్తా పార్టీ జిల్లా నాయకురాలు రాధాదేవి మాట్లాడుతూ, 'యముని లోకపు మహిష గంటు మబ్బుచాటున బాణీలవలె ఉన్నాయన్న' పదాలను తరాల నాటి బానిసత్వం, యాజమాన్యం, అణచివేతపై చేసిన తిరుగుబాటుగా అభివర్ణించారు. తొలుత శ్రీశ్రీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. మహిళా దృక్పథంతో సాహిత్యాన్ని అధ్యయనం చేసేందుకు స్టడీ సర్కిల్ ఏర్పాటు చేయాలని ఈ సందర్భంగా తీర్మానించారు. ఈ కార్యక్రమంలో మహిళా సమాఖ్య కార్యదర్శి కోటా అంజమ్మ, సమితి ఉపాధ్యక్షురాలు ఎం. శిరీష , ఎం. మేరీమాధవి, సరోజిని, బి. అరుణ, ఎ. రమాదేవి పాల్గొన్నారు.

## తల్లిదండ్రులకూ సామాజిక బాధ్యత వుంటుంది

**హైదరాబాద్ :** రియాల్టీషోల పేరుతో తమ పిల్లల చేత అసభ్య ప్రదర్శనలు చేయిస్తూ వారి ప్రాథమిక హక్కుల్ని దెబ్బతీస్తున్నదికాకుండా, ఆ బాధ్యతారాహిత్యాన్ని విమర్శించినందుకు మహిళాసంఘాల మీద, మీడియా మీద కొందరు తల్లిదండ్రులు మానవ హక్కుల సంఘం ముందు ఫిర్యాదు చేయటాన్ని లోక్‌సత్తా పార్టీ మహిళా విభాగం మహిళాసత్తా ఆక్షేపించింది. మా పిల్లలు మా ఇష్టం అనే పేరుతో సామాజిక బాధ్యతను ఉల్లంఘించే అధికారం ఎవరికీ ఉండదు.




ఈవేళ కొన్ని డ్యాన్స్ ప్రోగ్రాంలలో చూపుతున్న అసభ్య ధోరణుల వల్ల సమాజంలో దుష్ప్రభావానికి అవకాశం ఉందికాబట్టి, వాటిని అరికట్టాల్సిన బాధ్యత సమాజం మీద ఉంటుంది. రికార్డింగ్ డ్యాన్సులకు రియాల్టీ షోలలో పిల్లల డ్యాన్స్‌లకు తేడా లేకుండా పోయింది, అవి ముద్దుగా ఉన్నాయని చెప్పటం సిగ్గుచేటు. పరిణతి లేని పిల్లల చేత ఇలాంటివి చేయించటంతోపాటు డ్యాన్స్ ప్రాక్టీస్ పేరుతో తీవ్ర ఒత్తిడికి గురిచేస్తుండటం వల్ల వారి భవిష్యత్తు కూడా దెబ్బతింటుంది. సామాజిక ప్రభావం కలిగిన ఈ అంశాన్ని సొంత విషయంగా చూడకుండా తల్లిదండ్రులు, సంబంధితవర్గాలు బాధ్యతతో వ్యవహరించాలి. ■

# మహిళలపై హింస మానవహక్కుల ఉల్లంఘన

- డా॥ ఆలూరి విజయలక్ష్మి

"ఓ అమ్మా అవకాశముంటే మళ్ళీ నీ కడుపులో తలదాచుకోవాలని ఉంది. అక్కడ తప్ప ఇంకెక్కడా నాకు రక్షణ లేదు" అంటూ ఒక రచయిత్రి మహిళల దుఃఖానికి, అభద్రతకు అక్షర రూపాన్నిచ్చారు.

ఊయల నుండి స్మశానం దాకా జెండర్ ఆధారంగా స్త్రీలపై, బాలికలపై జరుగుతున్న హింస ప్రపంచంలో ఇప్పుడు అత్యంత విస్తృత స్థాయిలో జరుగుతున్న మానవహక్కుల ఉల్లంఘన – జాతి, మత, కుల, ప్రాంత, ఆర్థిక వర్గాల కతీతంగా అన్ని దేశాలలోని స్త్రీలు ఆర్థిక, సామాజిక, రాజకీయ, సాంస్కృతిక రంగాల్లో నేటికీ వివక్షకు గురవుతున్నారు; అనంతమైన హింసకు గురవుతూ నలిగిపోతున్నారు. మహిళలపై హింస జాతి, మత, కుల, ప్రాంతీయ, వర్గ సరిహద్దుల్ని దాటి సర్వవ్యాప్తంగా వుంది. నానాటికీ విస్తృతమవుతుంది. తీవ్రమవుతుంది. మహిళలపై హింస చుట్టూ ఆవరించిన మౌనం దానిని మరింత గాఢతరం చేస్తుంది. ఇది స్త్రీల అభివృద్ధిని కుంటుపరుస్తుంది. పబ్లిక్ జీవితంలో వారు భాగస్వాములు కాకుండా అడ్డుపడుతుంది. ఇది అత్యంత విస్తృత స్థాయిలో జరుగుతున్న మానవహక్కుల ఉల్లంఘన, అతి తీవ్రమైన జాతీయారోగ్యసమస్య.

మహిళలపై హింస ఆ మహిళల మీదే కాక వారి పిల్లలు, కుటుంబం స్నేహితులపై కూడా పడుతుంది. హింస కారణంగా వచ్చే శారీరక, మానసిక, భావోద్వేగపరంగా కలిగే ఫలితాల్ని ప్రత్యక్షంగా చూడడం వలన దాని ప్రతికూల ప్రభావాలుంటాయి.

## స్త్రీలపై హింస అంటే ఏమిటి?

ఒక వ్యక్తి వేరొక వ్యక్తిని అదుపు చేయడానికి, అధికారం లేకుండా చేయడానికి, లేక మరియు గాయపరచడానికి ఉపయోగించే బలాన్ని లేక శక్తిని హింస అని అంటారు.

స్త్రీలకు శారీరక, మానసిక, లైంగిక హాని లేక బాధను కలిగించే జెండర్ ఆధారిత హింస లేక హింసిస్తాననే బెదిరింపు లేక బలప్రయోగాలు, స్త్రీల స్వాతంత్ర్యాన్ని హరించే ప్రయత్నాలు లేక ప్రైవేట్ లేక పబ్లిక్ జీవితాన్ని ప్రమాదభరితం చేసే పనులు 'స్త్రీలపై హింస' గా పరిగణింపబడతాయి.

## భారతదేశంలో సమస్య తీవ్రత

- సుమారుగా ప్రతి 3 నిమిషాలకు మహిళలపై ఒక నేరం జరుగుతోంది.
- ప్రతి 75 నిమిషాలకు ఒక వరకట్న సంబంధిత హత్య జరుగుతోంది.
- ప్రతి 53 నిమిషాలకు ఒక ఈవ్‌టీజింగ్ జరుగుతోంది.
- ప్రతి 29 నిమిషాలకు ఒక మానభంగం జరుగుతుంది. ఇందులో 84 శాతం నేరస్థులు తెలిసిన వ్యక్తులే
- ప్రతి 9 నిమిషాలకు భర్త, అతని బంధువుల క్రూరత్వానికి ఒక మహిళ గురవుతోంది.
- ప్రతి 33 నిమిషాలకు ఒక స్త్రీ లేక బాలిక బలత్కారంగా ఎత్తుకు పోబడుతుంది. (ABDUCTION) లేక అపహరణకు (KIDNAP) గురవుతోంది.
- దాదాపుగా ప్రతి 5గురు వివాహితల్లో ఒకరు గృహహింసకు గురవుతున్నారు. 21 శాతం మంది స్త్రీలు 15 సంవత్సరాల వయసు నుండి హింసకు గురవుతున్నట్లు సర్వేలు తెలుపుతున్నాయి.
- 19 శాతం మంది స్త్రీలు భర్తల చేత దెబ్బలు తింటున్నట్లు రిపోర్ట్ అయింది.

## వివిధ జీవితదశలలో మహిళలపై హింస

తల్లి గర్భంలో వున్నప్పుడు, పుట్టగానే, పసితనంలో, బాల్యంలో, కౌమారదశలో, యవ్వన దశలో, ప్రౌఢదశలో, చివరకు వృద్ధస్త్రీలు, విధవలు కూడా రకరకాల హింసలకు గురవుతున్నారు.

## స్త్రీలపై హింస - వివిధ స్థాయిలు

1. కుటుంబం 2. సమాజం, 3. పనిచేసేచోట 4. రాజ్యం

**కుటుంబం :**

శతాబ్దాలుగా స్త్రీ, పురుష అధికారాల్లో స్థిరపడిన వ్యత్యాసాన్ని ప్రతిబింబించే అంశం స్త్రీలపై హింస. స్త్రీలపై పురుషుల ఆధిక్యాన్ని బలపరచే సాధనం స్త్రీలపై హింస. స్త్రీలపై తమకు హక్కు ఉందని భావించే పురుషులు ఆ హక్కును స్త్రీలు ప్రతిఘటించకుండా 'నిర్బంధం', 'అణచివేత' సాగిస్తారు. స్త్రీలను అణచివుంచగల రాజకీయం పితృస్వామ్య వ్యవస్థ అమలు పరిచే దుర్మార్గం. కుటుంబ ప్రేమ, బంధం, ఆసరా అనే విశిష్ట లక్షణాలతో ఏర్పడుతుందని భావిస్తున్నప్పటికి అది హింసాత్మక మానవ సంబంధాల కేంద్రంగా తయారయింది. కుటుంబ ఆధిపత్యం సంబంధాలను, జెండర్ అసమానతలను తన సభ్యులు

అంగీకరించేలా చేస్తుంది. అంతర్గతం చేసుకునేలా చేస్తుంది. స్త్రీలపై హింసను పలురకాల భావజాల ప్రచారాల్తో 'సహజం' చేస్తుంది. స్త్రీలపై కుటుంబస్థాయిలో జరిగే హింస శారీరక, మానసిక, లైంగిక, ఆర్థిక రూపాల్లో ఉంటుంది.

### సామాజిక హింస

కుటుంబ చట్రాన్ని, అందులో స్త్రీల స్థానాన్ని స్థిరీకరించడంలో సమాజం చాలా ప్రముఖమైన పాత్రను నిర్వహిస్తుంది. ఆదర్శకుటుంబంలో జెండర్ సంబంధాలను నిర్వహించడమే సమాజం స్త్రీలపై కొన్ని రకాల హింసల్ని అమలు చేస్తుంది. జననాంగాల విచ్ఛేదన, మంత్రగత్తెలని ముద్రవేసి చంపడం, జోగినీ సంప్రదాయం, దేవదాసీ వ్యవస్థ, సతి, వివాహేతర లైంగిక సంబంధాలకు శిక్ష మొదలైనవి జాతి లేక మత సమగ్రతను నిలపడం పేరున అమలు చేసే జెండర్ హింస రూపాలు. రోడ్లమీద, బస్సుల్లో, రైళ్ళలో, స్కూల్స్, కాలేజీలు, యూనివర్శిటీలలో జరిగే ఈవ్‌టీజింగ్, ర్యాగింగ్, లైంగిక వేధింపులు, ప్రేమపేరుతో వంచించడం, ప్రేమించమని వేధించడం, ప్రేమించకపోతే తెగనరకడం, యాసిడ్ గుమ్మరించడం, అపహరించుకుపోయి మానభంగం చెయ్యడం, సామూహిక మానభంగాలు, జాతి, మత, కుల, వర్గ సంఘర్షణల్లో స్త్రీలపై జరిగే అత్యాచారాలు సామాజిక హింసలో భాగమే.

ఆడపిల్లల్ని ఎత్తుకుపోయి, అమ్మి, బలవంతంగా వేశ్యావృత్తిలోకి దించడం సర్వసామాన్యమయిపోయింది. భారతదేశంలో వేశ్యావృత్తిలో వున్న స్త్రీలలో 18శాతం మంది మైనర్ బాలికలే. పేదరికం, సామాజిక, సాంస్కృతిక ఆచారాలు, అంతర్జాతీయ కార్మిక వలసలు, సెక్స్‌టూరిజం, ఆర్థిక సరళీకరణలు, గ్లోబలైజేషన్ విజృంభణ మొదలైన అంశాలు బాలికలపై హింసతో ముడిపడి వున్నాయి. వీధుల్లో జీవించవలసిన పరిస్థితిలో వున్న వేలాదిమంది బాలికలు సెక్స్‌వ్యాపారుల చేతుల్లో లైంగిక దోపిడీకి గురువుతున్నారు. ప్రసారసాధనాలు మహిళలపై హింసను ప్రేరేపించడంలో ప్రముఖ పాత్ర వహిస్తున్నాయి.

### స్త్రీలపై పనిచేసే చోట జరిగే హింస

పెట్టుబడిదారీవ్యవస్థ అవసరాలు స్త్రీలు కూడా ఇంటిని వదిలి సమాజంలోకి వచ్చి పనిచెయ్యడాన్ని తప్పనిసరి చేస్తున్నాయి. ఆవిధంగా బయటికి వచ్చే స్త్రీలపై హింసకు పనిచేసే ప్రదేశం కేంద్రమయింది.

నిరుద్యోగం, ఉద్యోగభద్రత లేకపోవడం, తక్కువ జీతాలు లేక సమాన పనికి పురుషులతో సమానంగా వేతనాలు లేకపోవడం స్త్రీలపై హింసలో భాగమే. భారతదేశంలో పనిచేసే స్త్రీలలో 94 శాతం మంది అసంఘటితరంగంలో ఉన్నారు. తక్కువ చదువు, తక్కువ నైపుణ్యాలు, తక్కువస్థాయి ఉద్యోగాలు, తక్కువ వేతనాలు, ఎక్కువ పనిగంటలు, దుర్భరమైన పని పరిస్థితులు, ఎటువంటి హక్కులు, పనిభద్రత లేకపోవడం, ఉద్యోగం పోతే మళ్ళీ మరొకటి పొందే అవకాశం లేకపోవడంతో స్త్రీలు తాము పనిచేసే చోట తోటి ఉద్యోగులు, లేబర్ కాంట్రాక్టర్లు చేసే లైంగిక వేధింపుల్ని భరిస్తున్నారు. వివిధ రంగాలలో ఉన్నతస్థాయి ఉద్యోగాలలో ఉన్న స్త్రీలు కూడా తోటి ఉద్యోగుల నుండి, పై ఆఫీసర్ల నుండి లైంగిక వేధింపుల్ని ఎదుర్కొంటున్నారు. మారుతున్న మార్కెట్ శక్తులకనుగుణంగా మారుతున్న సామాజిక దృశ్యానికి అనుగుణంగా జెండర్ న్యాయచట్టాలను రూపొందించకపోవడం వలన, ఉన్నచట్టాలను కూడా పటిష్టంగా అమలు చేయకపోవడం వల్ల కూడా స్త్రీలు సామాజిక హింసకు బలి అవుతున్నారు.

### రాజ్యహింస

పోలీసులు, సైనికులు, ప్రజాప్రతినిధులు, ప్రజలరక్షణకై నియమించబడిన అధికారులు తమ అధికారబలంతో స్త్రీలపై అమలు చేసే హింసను రాజ్యహింసగా పరిగణిస్తారు. నేరాల్ని ఒప్పించడంలో భాగంగా ఆయా పురుషుల తాలూకు స్త్రీలను హింసించడం, ఆ పురుషుల ఆచూకి తెలపమని హింసించడం, పోలీస్‌కస్టడీలో ఉన్న స్త్రీల మీద లైంగిక అత్యాచారాలను జరపడం రాజ్యహింసలో భాగమే. అన్యాయాలకు, అక్రమాలకు వ్యతిరేకంగా ఉద్యమించినప్పుడు, ప్రశ్నించినప్పుడు, సంఘటితమైనప్పుడు కూడా స్త్రీలు రాజ్యహింసకు గురవుతున్నారు. తిరుగుబాట్లను అణచివేయడంలో భాగంగా ప్రజలను నిర్బంధించి స్త్రీలపై అత్యాచారాలు జరపడం, సామాజిక విముక్తి కార్యకలాపాలలో భాగస్వాములైన స్త్రీలను భయభ్రాంతుల్ని చేసి చెదరగొట్టడానికి లైంగిక అత్యాచారాలు జరపడం, నిర్వాసితులు, కాందిశీకులు అయిన స్త్రీలపై అత్యాచారాలు జరపడం కూడా ఈ హింసలో భాగమే.

అభివృద్ధి, జనాభా నియంత్రణ, పారిశ్రామికీకరణకు సంబంధించిన పాలసీలు స్త్రీలకు వ్యతిరేకంగా వుండి స్త్రీలపై హింసకు కారణమవుతున్నాయి.

### మహిళలపై హింస - ఆరోగ్యంపై ప్రభావం :

**శారీరక ఆరోగ్యం :**

- చిన్న చిన్న గాయాల నుండి, అశక్తత, అంగవైకల్యం, చివరకు మరణానికి దారి తీసేంతటి గాయాలు
- జీర్ణ వ్యవస్థకు సంబంధించిన సమస్యలు

**మానసిక ఆరోగ్యం :**

- ఆత్మగౌరవాన్ని, ఆత్మవిశ్వాసాన్ని కోల్పోవడం
- తీవ్రమైన కుంగుబాటు (Depression) ఆందోళన (Anxiety) ఒత్తిడి (Stress)
- మానసిక దుర్బలతతో మద్యం, మాదకపదార్థాలు (Drugs) పొగతాగడం, విచ్చలవిడి లైంగిక ప్రవర్తనలకు అలవాటుపడడం.

### లైంగిక మరియు పునరుత్పత్తి ఆరోగ్యంపై ప్రభావాలు:

- గర్భవతి హింసకు గురయితే అధిక రక్తస్రావం, గర్భస్రావం, నెలలు నిండక మునుపే ప్రసవం, బిడ్డ లోపల చనిపోయి పుట్టడం, తల్లి మరణించడం మొదలైన ప్రమాదకర పరిణామాలు.
- కోరుకోని గర్భాలు, వాటి సంబంధిత సమస్యలు, తల్లిబిడ్డలకు అనారోగ్యాలు, మరణాలు
- పొట్టకు బలంగా దెబ్బతగిలితే లోపలి జననాంగాలకు ఇన్ఫెక్షన్లు, సంతానోత్పత్తి శక్తిని కోల్పోవడం
- క్రమం తప్పి బ్లీడింగు అవడం, పొత్తికడుపులో దీర్ఘకాలిక నొప్పి, బహిష్టులో తీవ్రమైన నొప్పి
- లైంగికవ్యాధులు, హెచ్ఐవి/ఎయిడ్స్

### బాధితురాలి పిల్లలు, కుటుంబసభ్యులు, కమ్యూనిటీపై ప్రభావం

- నిత్యం కుటుంబంలోని స్త్రీలపై అమలయ్యే హింసను చూస్తూ పెరిగే పిల్లలు ఈ నేరంతో ప్రభావితమై హింసను జీవన విధానంగా అంతర్గతం చేసుకుని భవిష్యత్తు జీవితంలో హింసకులుగా, హింసను భరించేవారుగా తయారయ్యే ప్రమాదం వుంది. వారి మానసిక స్థితి సహజంగా వుండదు. చదువు, ఇతరులతో సంబంధ బాంధవ్యాలను ఏర్పరచుకోవడం, సమగ్రంగా అభివృద్ధి చెందడంలో ఇబ్బందుల్ని ఎదుర్కొంటారు.
- బాధితురాలి కుటుంబసభ్యులు, స్నేహితులు, సహోద్యోగులు, ఇరుగుపొరుగు వారు ఆ హింసను ప్రత్యక్షంగా చూచిన వారందరిపై దానిప్రభావం ఉంటుంది.

### మహిళలపై హింస - ఆర్థిక అభివృద్ధిపై ప్రభావం

హింసకు గురయిన స్త్రీలు శారీరక, భావోద్వేగపరమైన శక్తిని కోల్పోవడంచేత, గాయాలకు చికిత్సకోసం హాస్పటల్‌కు వెళ్ళడం లేక హాస్పటల్లో చేరడం కారణంగా ఇంటిపనితోనూ, బయటిపనుతోనూ పూర్తిస్థాయిలో, పూర్తి శక్తిసామర్థ్యాలతో పాల్గొనలేకపోవడం వలన ఆర్థిక వ్యవస్థ నష్టపోతుంది. అభివృద్ధి కుంటుపడుతుంది. హింసకారణంగా వచ్చే వివిధ ఆరోగ్యసమస్యలు చికిత్సకు వెచ్చించవలసిన వనరులు ప్రజారోగ్య వ్యవస్థకు భారంగా మారతాయి.

### హింసకు గురయ్యే మహిళలకు అవసరమైన సహాయక చర్యలు

1. ఉచిత న్యాయ సహాయకేంద్రాలు, 2. ఉచిత తాత్కాలిక షెల్టర్ హోమ్స్ 3. పునరావాస కేంద్రాలు 4. బాధిత స్త్రీలు తమ కోసం సంపాదించుకోవడానికి అవకాశం వున్న ఆర్థిక కార్యకలాపాల కేంద్రాలు 5. సంక్షోభాన్ని పరిష్కరించగల బృందాలు (Crisis Management groups) 6. నిరోధక చర్యల కేంద్రాలు 7. సమాజం నుండి సపోర్టు 8. కుటుంబ సభ్యుల తోడ్పాటు 9. భౌతిక భద్రత 10. హింస గురించి అవగాహన కలగడానికి ప్రచారం, మీడియా తోడ్పాటు, సమాజపు వైఖరిలో మార్పు 11. శరణాలయాలు, వైద్యసహాయానికి క్లినిక్స్, మానసిక సమస్యల్ని తొలగించడానికి కౌన్సిలింగ్ సెంటర్లు, వృద్ధాశ్రమాలు మొదలైన ప్రత్యేకసేవలు.

### సమస్య పరిష్కారానికి అవసరమైనవి

1. స్త్రీలపై హింసను నిర్మూలించడానికి ఎన్నో చట్టాలు వున్నప్పటికి వాటి అమలు సక్రమంగా జరగడం లేదు. చట్టాల్ని అమలు చేసే పోలీసు, న్యాయ యంత్రాంగాల్ని జెండర్ పరంగా చైతన్యపరచాలి.
2. స్త్రీల ఆర్థిక స్వావలంబనకు ఏర్పాట్లు
3. చట్టాల గురించి స్త్రీలకు అవగాహన కల్పించడం
4. సమాజం స్త్రీలను చూచే దృష్టిలో మార్పు - చట్టం ఒక్కటీ మార్పు తీసుకురాలేదు, సామాజిక, సాంస్కృతిక మార్పు
5. స్త్రీ, పురుషుల మధ్య సంబంధాల తాలూకు జెండర్ స్టీరియో టైప్స్‌ని తొలగించే కృషి, పాఠ్యపుస్తకాలలో జెండర్ స్టీరియోటైప్స్‌ని ప్రతిబింబించే అంశాల్ని తొలగించడం.
6. విలువల వ్యవస్థను మార్చి స్త్రీ, పురుషుల మధ్య వున్న నిర్బంధాల్ని తొలగించి స్త్రీల అభివృద్ధి కోసం కృషి
7. వివాహం, స్త్రీలస్థాయి, కుటుంబంలో వారి పాత్ర గురించి యువతను సెన్సిటైజ్ చెయ్యడం - పురుషత్వం నిర్వచనాన్ని, లక్షణాల్ని మార్చడం.
8. స్త్రీలకు స్త్రీల తోడ్పాటు
9. స్త్రీలపై హింసను నిరసించే వాతావరణ కల్పన
10. మహిళలపై హింసను నిర్మూలించడానికి కృషి చేసే పురుషబృందాలు ఏర్పాటు

"గుండెలపై గాయాలు, మెదడుపై దెబ్బలు
చర్మమంతా వాతలు, చితికి పోయిన చర్మం
అరవటానికి గొంతుపెగలదు
ఇరుగు పొరుగులు నించుని చూస్తువుంటారు
సహాయం కోసం ఎంత ఏడ్చిన
అక్కడ ఎవరూ లేరు" - నీనానెహ్రూ

# మున్సిపల్ ఎన్నికలకు సన్నద్ధం



రాష్ట్రంలో త్వరలో జరగనున్న మున్సిపల్ ఎన్నికలకు తొలిదశగా 32 మున్సిపాలిటీలలో, హైదరాబాద్ మినహా మిగిలిన 14 కార్పొరేషన్లలో ప్రచార కార్యక్రమాలు వెంటనే ప్రారంభించాలని పార్టీ నిర్ణయించింది. మున్సిపల్ ఎన్నికల సన్నద్ధతకు సంబంధించి మొదటి విడతగా 16 జిల్లాల నేతలతో శ్రీ డి.వి.వి.ఎస్.వర్మ, శ్రీ రామచంద్రయ్య, శ్రీ వై.డి.రామారావు, శ్రీ కటారి శ్రీనివాసరావు, శ్రీ లక్ష్మణ్‌బాలాజీలు క్షుణ్ణంగా చర్చించి కార్యక్రమాల్ని రూపొందించారు. ఇందుకోసం 4,5 తేదీల్లో రెండు రోజుల పాటు హైదరాబాద్‌లోని ఫ్యాప్సీ హాల్లో సమావేశాలు నిర్వహించారు.

మున్సిపల్ ఎన్నికలంటే మొక్కుబడిగా జరిగేవికావని, తమకు ప్రభుత్వ సేవలు సక్రమంగా అందాలంటే ఎమ్మెల్యేల పెత్తనాన్ని తొలగించి స్థానిక ప్రభుత్వాలకు సాధికారత కల్పించాలని ప్రజలకు తెలియచెప్పేలా లోక్‌సత్తా ప్రచారం, ఎజెండా ఉంటాయి. ప్రజలకు స్వయంపాలన అందించటంలో స్థానిక ఎన్నికలు అత్యంత కీలకమని గల్లీగల్లీకి తెలియచేయాలి. అందుకోసం 3 అంశాల మీద ప్రజాభిప్రాయాన్ని మలిచేందుకు కార్యక్రమాలు నిర్వహించాలి. "మున్సిపల్ ఛైర్మన్, మేయర్‌కు ప్రత్యక్ష ఎన్నిక నిర్వహించటం, వార్డు కమిటీల ఏర్పాటు, పార్టీ రహిత ఎన్నికలు" అనే అంశాల మీద ప్రజల్ని చైతన్యపరిచి ప్రజాభిప్రాయాన్ని మలిచేందుకు చర్చావేదికలు, ప్రజాబ్యాలెట్లు నిర్వహించాలి.

తొలిదశగా మంచిర్యాల, బెల్లంపల్లి, మిర్యాలగూడ, నల్గొండ, జనగాం, కొత్తగూడెం, ఖమ్మం, మచిలీపట్నం, జగ్గయ్యపేట, ఒంగోలు, చీరాల, మార్కాపురం, నరసరావుపేట, రేపల్లె, తెనాలి, చిలకలూరిపేట, గూడూరు, వెంకటగిరి, రాజంపేట, నంద్యాల, ఆదోని, ఎమ్మిగనూరు, డోన్, గుంతకల్, చిత్తూరు, మదనపల్లి, శ్రీకాళహస్తి, విజయనగరం, బొబ్బిలి, భీమవరం, తణుకు, శ్రీకాకుళం మున్సిపాలిటీలతోపాటు 14 కార్పొరేషన్లలోనూ ప్రచారం ప్రారంభించాలి. వార్డు స్థాయిలో సమస్యల గుర్తింపు, వర్గీకరణ, శాశ్వత పరిష్కారంతో మేనిఫెస్టో రూపొందించటంతో పాటు కొన్నయినా తక్షణ సమస్యల్ని పరిష్కరించాలి. పార్టీని వార్డు స్థాయిలో పటిష్టం చేసేలా ప్రజలతో మమేకం కావాలి. స్థానిక యువజన, స్వచ్ఛంద సంస్థల వ్యక్తుల్ని పార్టీలోకి తీసుకునేందుకు కృషి చేయాలి. స్థానిక నేతలకు ఎక్కడికక్కడ నాయకత్వ శిక్షణా కార్యక్రమాలను నిర్వహించాలి. అలాగే గ్రామీణ ప్రాంతాల్లో పార్టీ త్వరలో చేపట్టనున్న 'పల్లెవెలుగు' కార్యక్రమానికి కూడా జిల్లాల నుంచి ఏర్పాట్లు ప్రారంభించాలి.

మొదటి విడత సన్నద్ధ సమావేశంలో ఆదిలాబాద్, నల్గొండ, వరంగల్, ఖమ్మం, కృష్ణా, ప్రకాశం, గుంటూరు, నెల్లూరు, కడప, కర్నూలు, అనంతపూర్, చిత్తూరు, విజయనగరం, తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, శ్రీకాకుళం జిల్లాల నేతలు పాల్గొన్నారు. ■

## బీసీ విద్యార్థులకు ఫీజు రీఇంబర్స్‌మెంట్

- ప్రభుత్వం వెంటనే భరోసా ఇవ్వాలి
- పరీక్షల సమయంలో వారిని ఆందోళనకు గురిచేయవద్దు

వృత్తివిద్యా కళాశాలల్లో ఫీజు రీఇంబర్స్‌మెంట్ చెల్లింపు విషయంలో ప్రభుత్వ తాత్సారం వల్ల లక్షల మంది వెనకబడిన, పేద విద్యార్థులు పరీక్షల సమయంలో కళాశాలల నుంచి తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొంటున్న విషయాన్ని కూడా సమావేశం చర్చించింది. రాష్ట్రప్రభుత్వం వెంటనే స్పందించి, విద్యార్థుల ఫీజులకు ఎటువంటి ఢోకాలేదు, చెల్లింపుకు తాను బాధ్యత తీసుకుంటానని కళాశాలలకు, సంబంధిత విభాగాలకు వెంటనే అధికారికంగా తెలియచేయాలని సమావేశం ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది.

# జనం చేతికి నేరుగా అధికారం ఇవ్వాలి



స్థానిక ప్రభుత్వాలకు సాధికారత కల్పించే దిశగా భారత ప్రభుత్వం తాజాగా రూపొందించిన ముసాయిదాలోని జిల్లా స్థాయి మండళ్ల ఏర్పాటు, అవినీతి నిరోధానికి అంబుడ్స్‌మన్, శాసనమండలిలో పంచాయతీల ప్రతినిధుల సంఖ్యను రెండింట మూడొంతులు చేయటం, మహిళలకు 50శాతం రిజర్వేషన్లు ఇవ్వటంతోపాటు రెండు ఎన్నికలకోసారి రొటేషన్ అమలు ప్రతిపాదనల్ని స్వాగతిస్తున్నాం. ఆ అంశాల్ని మరింత సమగ్రపరిచి చట్టంగా అమలుచేసేందుకు యుూపీయే ప్రభుత్వంతోపాటు పార్టీలకతీతంగా అందరూ చిత్తశుద్ధితో కృషి చేయాలి. రాష్ట్రాల విచక్షణతో పనిలేకుండా అధికార వికేంద్రీకరణ ఖచ్చితంగా అమలుచేయాలి.

జిల్లా స్థాయిలో గ్రామాలు, పట్టణాలకు కలిపి ఒకే ప్రణాళికను రూపొందించి అమలుచేసేందుకు ఉద్దేశించిన జిల్లామండళ్లు 'జిల్లా ప్రభుత్వాలు'గా పనిచేయాలి. జిల్లా కలెక్టర్లకున్న విశేషాధికారాలు ఇక మీదట జిల్లాస్థాయిలో ప్రత్యక్షంగా ఎన్నికైన ప్రభుత్వాధినేతకు ఉండాలి. జిల్లా ప్రభుత్వానికి కలెక్టర్ కేవలం ముఖ్య కార్యదర్శిగా మాత్రమే వ్యవహరించాలి. ఇప్పటివరకూ కేంద్ర, రాష్ట్రాలకే పరిమితమైన అధికారాలు మూడో అంచె పాలనావ్యవస్థలో భాగంగా జిల్లాలకు కూడా రావటం వల్ల అభివృద్ధి వేగవంతమవుతుంది.

అలాగే శాసనమండలిలో నూరుశాతం స్థానిక ప్రభుత్వాల ప్రతినిధులే ఉండాలని లోక్‌సత్తా పార్టీ తొలినుంచీ కోరుతోంది. తాజా ముసాయిదాలో కనీసం రెండింట మూడొంతులు అని ప్రతిపాదించటం కొంతవరకూ మేలు. శాసనమండలి కూర్పుపై తర్వాతిదశలో అవసరమైన మార్పులు చేయాలి అని రాజ్యాంగనిర్మాతలు చెప్పిన మాటల్ని రాజకీయ అవసరాల కోసం పాలకులు ఇప్పటివరకూ విస్మరిస్తూ వచ్చారు. స్వాతంత్ర్యం వచ్చి 63ఏళ్లవుతున్నా ఇంకా గ్రాడ్యుయేట్ నియోజకవర్గాలు, ఉపాధ్యాయ నియోజకవర్గాలు అంటూ ఎన్నికలు నిర్వహించటం తగదు. వాటన్నిటినీ తొలగించి పూర్తిగా స్థానిక ప్రభుత్వాల ప్రతినిధులే ఉండే ఏర్పాటు చేయాల్సుంది. రాజ్యసభ తరహాలోనే శాసన మండళ్ల కూర్పు కూడా ఉండటం అవసరం. మహిళలకు సీట్లలో సగం ఇవ్వటం అవసరం, అయితే రొటేషన్ వల్ల అభివృద్ధికి ఆటంకం కలగకుండా రెండు ఎన్నికలకోమారు రొటేషన్ అమలు చేయటం హర్షణీయం.

అధికారం జిల్లాస్థాయికి వెళ్లటం వల్ల పాలనలో ప్రక్షాళన మొదలవుతుంది. దాంతోపాటు గ్రామీణ-పట్టణ, వ్యవసాయం-పారిశ్రామికీకరణ మధ్య అంతరాన్ని తగ్గించే దిశగా వెంటనే చర్యలు తీసుకోవాల్సుంది. ఇందుకోసం రాష్ట్రంలో 1000 చిన్న పట్టణాలను అభివృద్ధి కేంద్రాలుగా చేసి వ్యవసాయాధారిత పరిశ్రమలను స్థాపించాలి. స్థానిక యువతకు అక్కడే నాణ్యమైన ఉపాధి అవకాశాల్ని కల్పించి వలసల్ని అరికట్టాలి.

స్థానిక సాధికారత కోసం పైన పేర్కొన్న వ్యవస్థీకృత ఏర్పాట్లతో పాటు జనం చేతికి నేరుగా కూడా అధికారం ఇవ్వాలి. తలసరి ప్రతి పౌరునికీ కనీసం రూ.1000 కేటాయించి, ప్రజలు ఎన్నుకున్న 'వార్డు కమిటీ'ల ద్వారా స్థానిక సమస్యల పరిష్కారానికి ఆ డబ్బును వినియోగించే చర్య కూడా ఉండాలి. దేశంలోని పౌరులందరికీ రూ.1000 ఇవ్వటానికి బడ్జెట్‌లో కేవలం 7శాతం మాత్రమే అవుతుంది. అధికారం నేరుగా జనం చేతికి ఇవ్వటం వల్ల మౌలిక మార్పు సాధ్యమవుతుంది. ■

# ప్రజా ప్రతినిధుల్ని దామాషా పద్ధతిలో ఎన్నుకోవటమే పరిష్కారం

## ఎమ్మెల్సీ అభ్యర్థుల వ్యయం రాష్ట్రంలో దిగజారిన రాజకీయానికి నిదర్శనం: లోక్‌సత్తా

స్థానిక సంస్థల నియోజకవర్గాల నుంచి శాసనమండలికి పోటీ చేస్తున్న అభ్యర్థులు ఒక్కొక్కరూ రూ.15కోట్లు ఖర్చు చేసేందుకు సిద్ధపడటం ఆంధ్రప్రదేశ్‌లో రాజకీయాలు ఎంత అధమస్థాయికి దిగజారాయో కళ్లకు కడుతోంది. కేవలం శాసనమండలిలో కూర్చునే అవకాశం కోసం అభ్యర్థులు అంత పెద్దఎత్తున డబ్బు ఖర్చు చేయటం దిగ్భ్రమ కలిగిస్తోంది. ఎగువ సభ ప్రభుత్వ మనుగడను నిర్ణయించలేదు. ద్రవ్యబిల్లుల్ని ఆమోదించలేదు, కనీసం ఏ చట్టాన్నీ 90రోజులు దాటి అడ్డుకోలేదు. అనేక అంశాల్లో విశ్వసనీయ, స్వతంత్ర పనితీరును ప్రదర్శించే భారత ఎన్నికల సంఘం... ఎన్నికల్లో డబ్బుప్రవాహాన్ని అడ్డుకోవటంలో మాత్రం ఘోరంగా విఫలమైంది.

ఎన్నికల్లో డబ్బుప్రవాహాన్ని అడ్డుకోవటానికి రాష్ట్ర, స్థానికసంస్థల స్థాయిలో ప్రభుత్వాధినేతల్ని ప్రత్యక్ష ఎన్నికల ద్వారా ఎన్నుకోవటం, ఎమ్మెల్యే, ఎంపీల ఎన్నికకు దామాషా పద్ధతి (నైష్పత్తిక ప్రాతినిధ్యం)ని అమలు చేయటమే వ్యవస్థీకృత పరిష్కారం. ఒక్క ఓటు ఎక్కువ వచ్చినా గెలిచినట్టే అనే ఎన్నికల విధానంలో స్వల్పసంఖ్యలో ఓట్లు కూడా ఫలితాన్ని శాసిస్తాయికాబట్టి డబ్బు బలం విపరీతమవుతోంది.

శాసనసభ్యుని ప్రాథమిక బాధ్యత శాసనసంబంధ కార్యక్రమాలు నిర్వహించటం, అయితే మన చట్టసభల్లో చాలామందికి శాసనాల రూపకల్పన మీద కనీస ఆసక్తి కూడా లేదు. తమ స్థానబలంతో ప్రభుత్వాన్ని ప్రభావితం చేసి లబ్ధిపొందాలన్న లక్ష్యంతోనే వారు ఎన్నికలబరిలోకి వస్తున్నారు.

“ఎప్పుడైతే ప్రభుత్వాధినేత ప్రత్యక్షంగా ఎన్నికవుతారో ఇక సభ్యులు సభలో తమ ఓటు ద్వారా అతను లేదా ఆమెను అస్థిరపరచలేరు. ఫలితంగా వారి మితిమీరిన ప్రాధాన్యతకు, పెడధోరణులకు అడ్డుకట్ట పడుతుంది”. అలాగే దామాషా పద్ధతిలో కొద్దిఓట్లు ఫలితాలను మార్చలేవు కాబట్టి ఓట్ల కొనుగోలు ఆగిపోతుంది. ■

# మేనేజ్‌మెంట్ కోటాను పెంచటం పరిష్కారం కాదు

## బ్యాంకుల ద్వారా ప్రభుత్వమే రుణాలిప్పించటంతో ఫీజు రీఇంబర్స్‌మెంట్ భారాన్ని రూ. 500కోట్లకు తగ్గించుకోవచ్చు...

విద్యార్థులకు ఫీజు రీఇంబర్స్‌మెంట్ భారాన్ని తగ్గించుకునేందుకు వృత్తివిద్యాకళాశాలల్లో మేనేజ్‌మెంట్ కోటాను పెంచేందుకు రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నం నిరసించదగింది. ఫీజు రీఇంబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్పుల ద్వారా వ్యయాన్ని నియంత్రించుకునేందుకు రాష్ట్రప్రభుత్వం పడుతున్న ఆందోళనను అర్థం చేసుకోగలం. అయితే పేద మెరిట్ విద్యార్థులకు నష్టం వచ్చేరీతిలో మేనేజ్‌మెంట్ కోటాను పెంచటం అందుకు పరిష్కారం కాదు. “ప్రస్తుతం రీఇంబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్పులకు రూ.3490కోట్లు అవసరంకాగా, సర్కారు రూ.2300కోట్లు మాత్రమే కేటాయించింది. ఇప్పటికే ఉన్నతవిద్య వ్యాపారమయం కావటం వల్ల పిల్లల చదువు వారి తల్లిదండ్రుల ఆర్థికస్థాయి మీదే ఆధారపడింది. ప్రభుత్వసాయం తగ్గించటం వల్ల పరిస్థితి మరింత ఇబ్బందికరంగా మారుతుంది. వివక్షలేకుండా పిల్లలందరూ ఎదిగేలా అందరికీ సమానావకాశాలు అందించటానికి విద్య ప్రధాన సాధనం కావాలి”.

ఆర్థికంగా, సామాజికంగా వెనకబడిన విద్యార్థులందరికీ రుణాలిప్పించే ఏర్పాటు చేయటంతోపాటు విద్యార్థి హాజరు, చదువులో ప్రతిభ ఆధారంగా వడ్డీభారానికి సబ్సిడీ ఇస్తే ప్రభుత్వానికి భారం చాలామేరకు తగ్గుతుంది.

మరోవైపు, సరైన ఎంపిక విధానం లేకపోవటం వల్ల అధిక ఆదాయ వర్గాల పిల్లలు కూడా ఫీజు రీఇంబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్పులు పొందుతున్నారు.

లోక్‌సత్తా చెబుతున్న పరిష్కారాన్ని అమలు చేయటం వల్ల ప్రభుత్వం ప్రస్తుతం ఖర్చు చేస్తున్న రూ.2300కోట్లు, అవసరమైన రూ.3490కోట్లు గురించి ఆందోళన చెందకుండా ఏటా కేవలం రూ.500కోట్లు లోపు వ్యయంతోనే అర్హులైన విద్యార్థులందరికీ ఫీజులు, స్కాలర్‌షిప్పులు అందించగలుగుతుంది. ■

# లోక్‌సత్తా పార్టీ జిల్లాల సమాచారం




**నెల్లూరు జిల్లా, పొదలకూరు:** శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరుజిల్లా, పొదలకూరు మండలం, లోక్‌సత్తా పార్టీ మండల కమిటీ ఆధ్వర్యంలో మండల అధ్యక్షుడు శ్రీ ఆవుల వెంకయ్య తేది: 15-4-2010 నాడు పొదలకూరు మెయిన్‌రోడ్డు ప్రక్కన లోక్‌సత్తా పార్టీ చలివేంద్రాన్ని ఏర్పాటు చేసారు. పై కార్యక్రమానికి పొదలకూరు సి.ఐ. శ్రీ అబ్దుల్‌కరీం, ఎస్.ఐ శ్రీ గంగ వెంకటరెడ్డి ముఖ్య అతిధులుగా విచ్చేసి చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పొదలకూరు లోక్‌సత్తా పార్టీ సెక్రటరీ శ్రీ ఎస్.కె. కలేషా, ఉపాధ్యక్షులు శ్రీ చంద్రశేఖర్, శ్రీనివాసులు రెడ్డి, కార్యకర్తలు మల్లిఖార్జున, గంగిరెడ్డి, చంద్రశేఖర్ మరియు లోక్‌సత్తా పార్టీ అభిమానులు పాల్గొని విజయవంతం చేసారు.




**గుంటూరు జిల్లా, నర్సరావుపేట:** నర్సరావుపేట పట్టణంలో ఏప్రిల్24, 2010 తేదీన "లోక్‌సత్తా పార్టీ" సభ్యత్వ నమోదు కార్యక్రమం ప్రారంభించబడింది. జిల్లా పార్టీ ప్రధాన కార్యదర్శి శ్రీ వి. శివనాగేశ్వరరావు కార్యక్రమాన్ని ప్రారంభించి లోక్‌సత్తా పార్టీ ఆశయాలను గురించి వివరించారు. మొదటిగా నర్సరావుపేటలోని కేశవస్కూలు డైరెక్టర్ గారైన శ్రీ పి.యల్.వి. రమణమూర్తి సభ్యత్వాన్ని స్వీకరించారు. ఈ కార్యక్రమానికి లోక్‌సత్తా పార్టీ ముఖ్యులు శ్రీ ఆళ్ళ సుబ్బారెడ్డి, శ్రీ కె.ఆర్.ప్రసన్నకుమార్, శ్రీ ఈదర గోపీచంద్, శ్రీ డి. పోతురాజు జిల్లా పార్టీ ఉపాధ్యక్షురాలు శ్రీమతి లలితకుమారి జిల్లా పార్టీ కార్యాలయ కార్యదర్శి శ్రీ పి.వి. రాఘవయ్య మరియు అనేక మంది స్థానిక పార్టీ సభ్యులు సానుభూతిపరులు హాజరయ్యారు.

## ప్రజాపథం చౌకబారు రాజకీయ ఎత్తుగడ

**గుంటూరు జిల్లా :** రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ప్రజాపథం కార్యక్రమం ఒక చౌకబారు రాజకీయ ఎత్తుగడ అని లోక్‌సత్తా పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి వి. శివనాగేశ్వరరావు ఆరోపించారు. ప్రజా సమస్యలను తెలుసుకోకుండా నాయకులు కాలక్షేపం చేస్తున్నారని తెలిపారు. ప్రజాపథంలో అధికార పార్టీ నాయకులకు, స్థానిక నేతలకు ప్రజా సమస్యల పట్ల వాగ్వివాదాలు చోటు చేసుకున్నాయని, వీటి గురించి ఏ ఒక్క నాయకుడు పట్టించుకోవడం లేదన్నారు. స్థానిక ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని అధికార పార్టీ నాయకులు ప్రజాపథం కార్యక్రమాన్ని అడ్డుపెట్టుకొని ప్రజలను మోసగిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.



## లోక్‌సత్తా సభ్యత్వ నమోదు ప్రారంభం

**హైదరాబాద్, వెంగళరావు నగర్ :** జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో లోక్‌సత్తా సభ్యత్వ నమోదు వెంగళరావునగర్ డివిజన్ రాజీవ్‌నగర్ కాలనీ చౌరస్తాలో శనివారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా గ్రేటర్ హైదరాబాద్ లోక్‌సత్తా అధ్యక్షులు ఎ.బి. ప్రతాప్‌రెడ్డి హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. నియోజకవర్గ ఇంచార్జి విజయ్‌కిరణ్, డివిజన్ అధ్యక్షులు మల్లికార్జునరావు, నాయకులు పవన్‌కుమార్, శంకర్‌గౌడ్, హసన్ తదితరులు పాల్గొన్నారు.

### లీగల్ విజిలెన్స్ సెల్ ఏర్పాటు చేయండి

**చిత్తూరు జిల్లా :** హైకోర్టు, సబార్డినేట్ కోర్టుల్లో అవినీతి, లంచగొండితనం అరికట్టేందుకోసం ప్రతి జిల్లాలో లీగల్ విజిలెన్స్ సెల్ ఏర్పాటు చేయాలని జిల్లా లోక్‌సత్తా అభ్యర్థించింది. చిత్తూరుకు వచ్చిన రాష్ట్ర హైకోర్టు చీఫ్ జస్టిస్ నిషార్ అహ్మద్ కక్రూకు జిల్లా లోక్‌సత్తా అధ్యక్షుడు వి. జయకుమార్ వినతిపత్రం అందజేశారు. పలువురు కక్షిదారులు కోర్టులో వాదోపవాదాలు ఆంగ్లంలో జరగడం వల్ల అర్థం కాకుండా సాక్ష్యాల రికార్డు చేసేటప్పుడు తప్పులు చేస్తున్నారని తమిళనాడులో మాదిరిగా ఇక్కడి సబార్డినేట్ కోర్టుల్లో తెలుగుభాష అమలు పర్చేందుకు ఆదేశాలివ్వాలన్నారు. చిత్తూరు కక్షిదారులకు హైదరాబాద్ దూరంగా ఉన్నందున తిరుపతిలో రాయలసీమ వారి కోసం హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేయాలని కోరారు. సబార్డినేట్ జ్యూడిషియల్ విభాగంలో ఆన్‌లైన్ సర్వీసులు ప్రవేశపెట్టాలని, సత్వరన్యాయం కల్పించేందుకోసం న్యాయశాఖలో సంస్కరణ అమలు చేయాలని, గ్రామ న్యాయలయాలు చట్టం అమలు చేసేటట్టు రాష్ట్ర ప్రభుత్వానికి తగు సూచల ఇవ్వాలన్నారు. న్యాయ సేవల గురించి ప్రజలు తెలుసుకునేందుకోసం అన్ని కోర్టుల్లో సిటిజన్ చార్టులు ఏర్పాటు చేయాలని, కోర్టులో సమాచార చట్టం అప్పిల్లేట్ అథారిటీ సూచించే బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. ప్రమాదాల కేసుల్లో ట్రిబ్యునల్ కోర్టు నిర్ణయాలు వచ్చేంత వరకు వేచి ఉండకుండా క్షతగాత్రులకు వెంటనే యాక్సిడెంట్స్ క్లెయిమ్స్ చెల్లింపులు జరిగేటట్లు ఆదేశించాలని కోరారు.

### లోక్‌సత్తా పల్లెవెలుగును విజయవంతం చేయండి

**చిత్తూరు జిల్లా :** రాష్ట్ర లోక్‌సత్తా పార్టీ పిలుపుమేరకు చిత్తూరు జిల్లాలో జరిగే పల్లెవెలుగు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పార్టీ జిల్లా అధ్యక్షుడు జయకుమార్ పిలుపినిచ్చారు. రానున్న ఆరు నెలల్లో స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని కార్యక్రమాలపై లోక్‌సత్తా పార్టీ విధి విధానాలను ప్రజల వద్దకు తీసుకెళ్ళేందుకు ప్రణాళిక సిద్ధం చేయాలన్నారు. ఈ సందర్భంగా చిత్తూరు పట్టణ అధ్యక్షుడిగా మాధవన్, కార్యదర్శిగా సుందర్‌రాజ్‌లను నియమిస్తూ ఆదేశాలు జారీ చేశారు.

పట్టణ కమిటీ ఆధ్వర్యంలో ప్రతి వార్డుకు కమిటీలు వేయాలని నిర్ణయించారు. పార్టీ కార్యకర్తలుగా మహిళలను, విద్యార్థులను ఆహ్వానించాలని తీర్మానించారు.

### సామాన్యులకు చేరువ కావడమే లక్ష్యం
### సర్వ జనసత్తా రాష్ట్ర కన్వీనర్ చెన్నయ్య

**ఖమ్మం జిల్లా, పాల్వంచ :** లోక్‌సత్తా పార్టీ సామాన్య ప్రజలకు మరింత చేరువ కావడానికి తమ సంస్థ కృషి చేస్తుందని సర్వజన సత్తా రాష్ట్ర కన్వీనర్ చెన్నయ్య అన్నారు. ఖమ్మం పట్టణంలోని లోక్‌సత్తా పార్టీ జిల్లా కార్యాలయంలో ఏప్రిల్ 24న ఏర్పాటైన సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు.





లోక్‌సత్తా పార్టీ మేధావులు, వైట్ కాలర్ పార్టీ అని విమర్శించే వారికి సమాధానం చెప్పడానికి బీసీ, ఎస్సీ, ఎస్టీ, ఈబీసీ వర్గాలతో సర్వజన సత్తాను స్థాపించామన్నారు. ప్రపంచంలో నిజాయితీగా పనిచేసే పార్టీ ఏదైనా ఉంటే అది లోక్‌సత్తా మాత్రమేనని ఆయన అన్నారు. సమావేశానికి లోక్‌సత్తా పార్టీ జిల్లా అధ్యక్షుడు జూపెల్లి సత్యనారాయణ అధ్యక్షత వహించారు. జిల్లా కార్యదర్శి చింతం లింగేశ్వరరావు సమావేశాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి రవిమారుత్, జిల్లా అధికార ప్రతినిధి సామినేని రాఘవులు, యువసత్తా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆంజనేయులు, నాయకులు రాఘవయ్య, వినోద్‌యాదవ్, హనుమంతరావు, భరణి, వెంకట్, పి.వి. రావు తదితరులు పాల్గొన్నారు.

## విజయనగరం జిల్లా

### షుగర్స్‌ను కాపాడుకుందాం...

**గంట్యాడ:** సహకార రంగంలో ఉన్న భీమసింగి చక్కెర కర్మాగారాన్ని రక్షించాల్సిన బాధ్యత అన్ని రాజకీయ పార్టీలపై ఉందని లోక్‌సత్తా పార్టీ జిల్లా అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ అన్నారు. మండలంలో కొర్లాం చెరకు కాటా వద్ద సాయంత్రం షుగర్స్ ప్రైవేటీకరణ యత్నాలకు వ్యతిరేకంగా జరిగిన చర్చా వేదికలో ఆయన పాల్గొన్నారు. పార్టీలకతీతంగా రైతుల నుంచి సంతకాల సేకరణతో ఉద్యమాన్ని గంట్యాడ నుంచి ప్రారంభిద్దామని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో 11 చక్కెర కర్మాగారాలను ప్రైవేటీకరించేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందని దీనిని అడ్డుకోవాలని అన్నారు. రాష్ట్ర రైతు సంఘం కార్యవర్గ సభ్యుడు మ(ద్ర)రావు సూర్యనారాయణ మాట్లాడుతూ కర్మాగారాలను ప్రైవేటు వ్యక్తులకు అప్పగిస్తే రైతులను తాకట్టు పెట్టినట్టేనని ఆరోపించారు.

రైతు సంక్షేమమని పదేపదే చెప్పే రాష్ట్ర ప్రభుత్వం ఇటువంటి చర్యలకు పాల్పడడం దారుణమని విమర్శించారు. ఇదే తీరు కొనసాగితే ఐక్యంగా ఉద్యమిస్తామని, ప్రభుత్వ నిర్ణయాన్ని ఉపసంహరించే దాకా పోరాడతామని హెచ్చరించారు. చర్చావేదికలో లోక్‌సత్తా పార్టీ గజపతినగరం నియోజకవర్గం ఇంచార్జి దేవర ఈశ్వరరావు, గంట్యాడ జెడ్పీటీసీ సభ్యుడు చింతల అప్పారావు, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వేమల రామునాయుడు, లోక్‌సత్తా పార్టీ మండల అధ్యక్షుడు ఎంఎస్ఎస్ రాజు జిల్లా రైతు సంఘం అధ్యక్షుడు బుద్ధరాజు రాంబాబు, పలువురు చెరకు రైతులు, కార్మికులు పాల్గొన్నారు.

## గవర్నర్ దృష్టికి చంద్రంపేట అత్యాచార సంఘటన

**గంట్యాడ:** మండలంలోని చంద్రంపేట గ్రామానికి చెందిన యువతిపై జరిగిన అత్యాచార సంఘటనను లోక్‌సత్తా పార్టీ తరపున రాష్ట్ర గవర్నర్ దృష్టికి తీసుకువెళ్లి బాధిత కుటుంబానికి న్యాయం జరిగేలా చూస్తామని లోక్‌సత్తా జిల్లా అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ అన్నారు. బాధిత యువతి కుటుంబీకులను పార్టీ జిల్లా నాయకులతో కలిసి వెళ్లి ఆయన పరామర్శించారు. బాధితురాలి తండ్రి కృష్ణతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. విశాఖ కె.జి.హెచ్.ఓ.లో చికిత్స పొందుతున్న తన కూతురు ఆరోగ్య పరిస్థితి అలాగే ఉందని ద్రవాహారం మాత్రమే తీసుకుంటున్నదని తెలిపాడు. అనంతరం బాబ్జీ విలేఖరులతో మాట్లాడుతూ మానవమృగాలకు బలైన యువతికుటుంబాన్ని ఆదుకోవాలని గానీ, కనీసం పరామర్శించాలన్న విషయంలో ప్రజాప్రతినిధులు స్పందించలేకపోవడం శోచనీయమన్నారు. మహిళలపై దాడులు, అత్యాచారాలు పెరిగిపోతున్నాయని చట్టంలో కఠినమైన శిక్షలు లేకపోవడమే కారణమని లోక్‌సత్తా మహిళా జోనల్ కో-ఆర్డినేటర్ అనంతలక్ష్మి అన్నారు. ఇలాంటి చర్యకు పాల్పడిన వారికి ఉరిశిక్ష విధించడం వంటి తీవ్రమైన శిక్షలు విధిస్తే భవిష్యత్‌లో సంఘటనలు పునరావృతం కావన్నారు. బాధిత, యువతి కుటుంబీకులకు లోక్‌సత్తా తరపున వెయ్యి రూపాయల నగదును పార్టీ జిల్లా అధ్యక్షులు బాబ్జీ, నాయకులు అందజేశారు. కార్యక్రమంలో లోక్‌సత్తా మహిళా జిల్లా అధ్యక్షురాలు సుభద్రాదేవి నియోజకవర్గ అధ్యక్షులు భారతి, మండలశాఖ అధ్యక్షులు ఎం.ఎస్.ఎన్.రాజు, జ్యోతి, భాస్కర్ పాల్గొన్నారు.

## జిల్లా ప్రభుత్వాలతోనే ప్రగతి సాధ్యం

**విజయనగరం :** జిల్లా ప్రభుత్వాలతోనే ప్రగతి సాధ్యమని విజయవాడ ఎంపీ లగడపాటి రాజగోపాల్ వ్యాఖ్యలపై లోక్‌సత్తా పార్టీ హర్షనీయమని శృంగవరపుకోట నియోజకవర్గ ఇన్‌చార్జి డి.సుర్యారావు అన్నారు. శృంగవరపుకోట లోక్‌సత్తా పార్టీ కార్యాలయంలో ఏప్రిల్ 26న జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ తమ పార్టీ అధినేత డాక్టర్ జయప్రకాష్ నారాయణ తొలినుంచి ఇదే విషయం చెబుతున్నారన్నారు. కానీ ప్రధాన పార్టీలు పట్టించుకోకపోవడం వల్లే రాష్ట్రంలో అశాంతి నెలకొంటుందన్నారు. యువసత్తా ఉపాధ్యక్షుడు ఎస్.కోటేశ్వరరావు పీ.వి.వర్మ గౌరీశంకర్, బీ.వీ. రాములమ్మ తదితరులు పాల్గొన్నారు.

## లోక్‌సత్తా సభ్యత్వ నమోదు వేగవంతం

**చీపురుపల్లి:** గ్రామస్థాయిలో సభ్యత నమోదు వేగవంతం చేయాలని లోక్‌సత్తా పార్టీ జిల్లా ఇంచార్జి భీశెట్టి బాబ్జీ పిలుపునిచ్చారు. పట్టణంలోని అంజనేయపురంలోగల లోక్‌సత్తా పార్టీ కార్యాలయంలో ఏప్రిల్ 27న ఆయన పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. చీపురుపల్లి నియోజకవర్గ ఇంచార్జి బాధ్యతలు నిర్వహిస్తున్న లక్ష్మీనాయుడుకి సభ్యత్వ రశీదును బాబ్జీ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లోక్‌సత్తా పట్ల, పార్టీ సిద్దాతాల పట్ల, పార్టీ వ్యవస్థాపకుడు జయప్రకాష్ నారాయణ నాయకత్వం పట్ల ప్రజలు ఆకర్షితులవుతున్నారన్నారు. ఈ సందర్భంగా బాబ్జీ నుంచి సభ్యత్వం పొందిన రెడ్డి లక్ష్మీనాయుడు మాట్లాడుతూ ప్రజల్లో అవగాహన లేక పోవడంతోనూ ఆర్థిక ఇబ్బందుల కారణంగా పార్టీని నడిపించలేక పోతున్నారు. ఈ కార్యక్రమంలో రమణ, సత్యారావు, దాలినాయుడు, నారాయణరావు, సతీష్‌కుమార్ పార్టీ సభ్యత్వం తీసుకున్నారు.

## ఉపాధి కూలీలకు న్యాయం చేయండి

**శృంగవరపుకోట:** శృంగవరపుకోట మండలంలో పనిచేస్తున్న ఉపాధి కూలీలకు ప్రభుత్వం న్యాయం చేయాలని, వారు చేసే పనికి గిట్టుబాటు కూలీ కల్పించాలని లోక్‌సత్తా నియోజకవర్గ ఇంచార్జి దొడ్డి సూర్యారావు డిమాండ్ చేశారు. ఏప్రిల్ 27న ఆయన సంతగైరమ్మపేట గ్రామంలో ఉపాధి కూలీలతో మాట్లాడారు. ఈ సందర్భంగా పలువురు కూలీలు తమకు కష్టం తప్ప ఫలితం దక్కడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సూర్యారావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఉపాధి కూలీకి వంద రూపాయిలు ప్రతిరోజూ కూలీ వచ్చేటట్లు చేస్తామని చెప్పి కనీసం వారికి 40 నుంచి 50 రూపాయలు కూలీ ఇవ్వకపోతే వారికి ఏ రకంగా పనిచేస్తే గిట్టుబాటు కూలీ వస్తుందో చెప్పాలని కోరారు.

## దళితుల భూములు కబ్జా

**చీపురుపల్లి:** కర్లాం గ్రామంలో సర్వే నెంబర్ 408లోని దళితుల భూములు కబ్జాకు గురయ్యాయని లోక్‌సత్తా పార్టీ తహశీల్దార్‌కు ఫిర్యాదు చేసింది. ఆ పార్టీ నియోజక వర్గ అధ్యక్షుడు రెడ్డి లక్ష్మీనాయుడు, రమణలు తహశీల్దార్ సూర్యనారాయణకు మంగళవారం వినతిపత్రం అందజేశారు. 408 సర్వే నెంబర్‌లోని భూములు బీనామిదారుల చేతుల్లో ఉన్నాయన్నారు. తక్షణమే ఆ భూములను ప్రభుత్వం స్వాధీనం చేసుకుని పేద దళితులకు పంచిపెట్టాలని లోక్‌సత్తా నాయకులు తమ ఫిర్యాదులో సూచించారు. లోక్‌సత్తా వెంట సామాజిక న్యాయ ఉద్యమ వేదిక కన్వీనర్ గంటాన అప్పారావు ఉన్నారు.

### తాగునీటి కష్టాలు తీర్చండి

**జామి:** జామిలోని నెయ్యిల వీధిలో తాగునీకి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని లోక్‌సత్తా పార్టీ ఎస్.కోట నియోజకవర్గ కమిటీ ఉపాధ్యక్షులు కె.వై.బాస్కర్, కార్యదర్శి కనకల రమేష్‌లు తెలిపారు. బోరుబావి నుంచి మట్టితో కూడిన నీరు రావడంతో తప్పని పరిస్థితిలో ఈ నీరును తాగాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి తాగునీటి ఇబ్బందులను తీర్చాలని కోరారు.

### జామి- ఫైవ్‌మెన్ కమిటీని నియమిస్తాం

**జామి:** భీమసింగిలోని రహదారి నిర్మాణంలో అవకతవకలు జరిగినట్లు వచ్చిన ఆరోపటణలపై ఫైవ్‌మెన్ కమిటీ నియమించి, పరిశీలిస్తామని లోక్‌సత్తా జిల్లా అధ్యక్షుడు భీశెట్టి బాబ్జి తెలిపారు. ఏప్రిల్ 30న భీమసింగి రహదారిని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ పూర్తి స్థాయిలో పరిశీలించి నివేదిక తయారు చేస్తామని చెప్పాడు. కార్యక్రమంలో లోక్‌సత్తా పార్టీ నాయకులు దయానంద్, నాగరాజు, టి.భానుమూర్తి, వి.కె.వి.ఎస్.శర్మ, తదితరులు పాల్గొన్నారు.

### లోకాయుక్త అధికారాల కోసం కార్డు ఉద్యమం

**బొబ్బిలి:** కర్నాటకలో లోకాయుక్త అధికారాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ పెద్ద ఎత్తున పోస్టుకార్డు ఉద్యమం చేస్తున్నట్లు కర్ణాటక రాష్ట్ర లోక్‌సత్తా సహాయ కార్యదర్శి ఆలవెల్లి శ్రీనివాసరావు చెప్పారు. బొబ్బిలిలో మే 4న ఆయన విలేకరులతో మాట్లాడారు. గత ఏడాది ఏప్రిల్‌లో కర్నాటకలో లోక్‌సత్తా పార్టీని ప్రారంభించామని తెలిపారు. దేశవ్యాప్తంగా పార్టీని విస్తరించేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు. అవినీతిని ఎదుర్కొనేందుకు డాక్టర్ జయప్రకాష్ నారాయణ్ చేస్తున్న యజ్ఞంలో పాలుపంచుకోవడానికి ఆయా రాష్ట్రాల్లో ఉన్న తెలుగువారు లోక్‌సత్తా పార్టీని ఏర్పాటు చేస్తున్నారని తెలిపారు. తమిళనాడు, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాల్లో కూడా పార్టీని ప్రారంభించారని తెలిపారు. ఇటీవల బెంగుళూరులో జరిగిన కార్పొరేషన్ ఎన్నికల్లో లోక్‌సత్తా పోటీ చేసి తన ఉనికిని చాటిందన్నారు.

కర్నాటక రాష్ట్ర లోక్‌సత్తా సహాయ కార్యదర్శి ఏడుస్థానాల్లో పోటీ చేసి 7 నుండి 15 శాతం ఓట్లు సంపాదించామని వెల్లడించారు. ప్రజల చేతికే అధికారం అనే నినాదంతో ఎటువంటి హామీలు, డబ్బు, మద్యం పంపిణీ లేకుండా ప్రజల మధ్యకు వెళ్తున్నందుకు ఆదరణ బాగుంది అన్నారు. రాజకీయ పార్టీల్లో అవినీతిపై అసెంబ్లీలో చర్చ పెట్టినా ఈ రాష్ట్రంలో మిగతా పార్టీలవారు ఎవ్వరూ పాల్గొనలేదని విమర్శించారు. కార్యక్రమంలో లోక్‌సత్తా జిల్లా నాయకుడు పర్లు, యువసత్తా ప్రతినిధులు నూరిబాబు గంగరాజు, ఎ.దామోదరరావు పాల్గొన్నారు.

### మానవహక్కుల సంఘానికి ఫిర్యాదు చేస్తాం

గంట్యాడ: మండలంలోని చంద్రంపేట గ్రామంలోని అత్యాచారానికి గురైన బాలిక కుటుంబాన్ని అదుకుంటూ దీనిపై మానవ హక్కుల సంఘానికి ఫిర్యాదు చేస్తామని లోక్‌సత్తా పార్టీ జిల్లా అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ అన్నారు. మే 4న చంద్రంపేట గ్రామంలో బాలిక కుటుంబ సభ్యులతో మాట్లాడారు. బాలికకు న్యాయం జరిగే వరకు లోక్‌సత్తా పోరాటం చేస్తుందని అన్నారు. నిందితులను కఠినంగా శిక్షించే వరకు వదిలిపెట్టేది లేదని హెచ్చరించారు.

### సమస్యల పరిష్కారానికి డిమాండు

**మయూరి కూడలి:** పురపాలక పరిధిలోని 24వ వార్డును ఆనుకుని ఉన్న జిల్లా పరిషత్తు నుంచి రైల్వేస్టేషన్ వైపు వెళ్లే ఎడమవైపు ఉన్న కాలువ కొన్ని నెలలుగా పూడిపోయి మురుగు రహదారిపై పారుతుందని యువసత్తా జిల్లా అధ్యక్షుడు వి.వి.రమణ పేర్కొన్నారు. మే 1న ఈ ప్రాంతాన్ని యువసత్తా బృందం సందర్శించింది. పారిశుద్ధ్య నిర్వాహకులు పూడిక తీయడంలో నిర్లక్ష్యం చూపుతున్నారని, దీనివల్ల దుర్గంధం వ్యాపిస్తోందన్నారు. రహదారిపై మురుగునీరు ప్రవహించటం వల్ల పాదచారులు, వాహన చోదకులు ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ సమస్యను ప్రజాపథంలో అధికారులకు తెలియజేశామని తక్షణమే నివారిస్తామని హామీ ఇచ్చినా, నేటికీ నెరవేరలేదన్నారు. ఇప్పటికైనా దీనిపై అధికారులు దృష్టి సారించాలని పట్టణ లోక్‌సత్తా అధ్యక్షుడు పి.శ్రీనివారాజు, యువసత్తా జిల్లా కార్యదర్శి దయానంద్ శర్మ తదితరులు కోరుతున్నారు. ■




**కర్నూలు జిల్లా వరదబాధితులకు వంట సామాగ్రిని పంపిణీ చేస్తున్న లోక్‌సత్తా రాష్ట్ర సహాయకార్యదర్శి శ్రీ వి. విజయేందర్‌రెడ్డి**

### సూచన

**మీ జిల్లాలో లోక్‌సత్తా పార్టీ నిర్వహించిన కార్యక్రమాలు, సాధించిన విజయాలు తదితర సమాచారాన్ని తప్పనిసరిగా ఫొటోలతో పాటు ప్రతినెలా 10వ, 25వ తేదీల్లోగా పంపించండి. వీలువెంబడి వాటిని వరుసగా ప్రచురిస్తాం. స్థానికంగా మీ కార్యక్రమాల్ని రాష్ట్రవ్యాప్తంగా అందరికీ తెలియజేసేందుకు ఈ అవకాశాన్ని వినియోగించుకోండి.**

### వివిధ అంశాలపై మీరడిగే ప్రశ్నలకు

**డా॥ జేపీ సమాధానాలిస్తారు. ప్రచురించబడిన ప్రతి ప్రశ్నకు రూ॥ 100/- పారితోషికం ఇవ్వబడును**

# రవీంద్రనాధ్ టాగూర్

## మే 7, 1861 - ఆగస్టు7, 1941



జన గణ మన గీతాన్ని జాతికి అందించి
తన రచనలతో స్వాతంత్ర్య సమరస్ఫూర్తిని మేల్కొలిపి
సకల సృష్టిని ప్రేమభావంతో గీతాంజలిగా పలికించి
గ్రామాభ్యుదయమే దేశాభ్యుదయమని నమ్మి శ్రీనికేతన్ నెలకొల్పి
ప్రకృతిబడి పాఠాలు నేర్పేబడిగా 'శాంతినికేతన్'ని స్థాపించి
మతాలు వేరైనా కలిపేది స్నేహమని 'గోరా' లో చెప్పిన
విశ్వకవి రవీంద్రుని గీతిక

"ఎక్కడ మనస్సు నిర్భయంగా వుంటుందో,
ఎక్కడ మానవుడు సగర్వంగా తల ఎత్తుకుని తిరుగుతాడో,
ఎక్కడ విజ్ఞానం స్వేచ్ఛగా మనగలుగుతుందో,
ఎక్కడ ప్రపంచం ముక్కముక్కలై ఇరుకైన గోడల మధ్య ట్రుగ్గిపోవదో,
ఎక్కడ మాటలు అగాధమైన సత్యం నుంచి బాహిరిల్లుతవో,
ఎక్కడ అవిరామమైన అన్వేషణ, పరిపూర్ణత వైపు చేతులుచాస్తుందో,
ఎక్కడ పరిశుద్ధ జ్ఞానవాహిని మృతాంధ విశ్వాసపుటెడారిలో ఇంకిపోదో,
తలపులో, పనిలో, నిత్య విశాల పథాలవైపు ఎక్కడ మనస్సు పయనిస్తుందో-
ఆ స్వేచ్ఛాస్వర్గంలోకి, తండ్రీ! నా దేశాన్ని మేల్కొంచేట్టు అనుగ్రహించు"

ఆ మహనీయుని కలలు నేటికీ నిజం కాలేదు... అందుకే

**రండి...**

నవ భారతావనిని నిర్మిద్దాం
మనం వేసే ప్రతీ అడుగు దేశప్రగతిలో భాగం కావాలి

**అందుకే....**

**మనచేత.... మనకోసం...**

**లోకసత్తా పార్టీ**

RNI.Reg. No. APTEL/2010/32219

**లోక్‌సత్తా**
**కొత్త రాజకీయంతో**

# నగరంలో...

# మన డబ్బు... మన కోసం... మన కళ్ళ ఎదుటే

## ఎక్కడి సమస్యలకు ఇక అక్కడే సత్వర పరిష్కారం!



ప్రతి వార్డు /డివిజనుకి ఇతర నిధులతో పాటు అదనంగా
రూ॥ 1000/- ఏటా తలసరి నిధులు నేరుగా అందుతాయి

వార్డు/డివిజను జనాభా 50 వేలు అయితే - రూ॥ 5కోట్ల అదనపు నిధులు.
ఐదేళ్లలో రూ॥ 25 కోట్లు! - ఉన్నపథకాలకు అదనంగా.

వీధుల శుభ్రత, రోడ్లు, మంచినీరు, డ్రైనేజీ, పారిశుద్ధ్యం,
గ్రంథాలయాలు, పార్కులు, వీధి దీపాలు...
పౌరులు రూపొందించుకున్న 'వార్డు /డివిజను ప్రణాళిక'
బట్టే ఈ తలసరి నిధుల ఖర్చు.

Edited, Printed & Published at Hyderabad by Dr. Jayaprakash Narayan, Flat No. B. 504, Pasha Court, Somajiguda, Hyderabad - 500 082,
Printed at Kala Jyothi Process Pvt., Ltd., 1-1-60/5, RTC"X" Roads, Hyderabad